విలేకరులు కావలెను
కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499
సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు

విజయ సారథి
RNI / APTEL/2015/64956
తెలుగు దినపత్రిక

టీవీ రిపోర్టర్లు కావలెను
A.P VISION TV
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499
యండి. పి.వెంకటేశ్వర్లు


చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | బుధవారం 03-09-2025 | సంపుటి : 11 | సంచిక : 206 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.

# రాష్ట్రంలో డిమాండ్‌ను మించి ఎరువులు

రైతులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దు
ఇ-క్రాప్ ద్వారా పంటల సాగు వివరాలు నమోదు
ఉల్లి నిల్వలను పూర్తిగా కొనుగోలు చేయాలి
అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబు





అమరావతి,సెప్టెంబర్ 1(ఆర్ఎన్ఎ):రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. డిమాండ్ కంటే అదనంగానే నిల్వలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలి పోకుండా కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఉద్యాన పంటలు, ఎరువుల లభ్యత, మార్కెటింగ్ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఇ-క్రాప్ ద్వారా రాష్ట్రంలో ఎంత మేర ఏ పంటలు సాగు అవుతున్నాయి. ఎరువుల వినియోగం ఎంత జరుగుతుందన్న లెక్కలు తీయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిరంతర పర్యవేక్షణ ద్వారా సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈసారి 2.02 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయ్యిందని.. వాస్తవ డిమాండ్ కంటే అదనంగా నిల్వలు ఉన్నాయని అధికారులు వివరించారు. గతంతో పోలిస్తే ఈసారి 91 వేల మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా వచ్చినట్టు- తెలిపారు. ఇక డిఏపి 51,700 మెట్రిక్ టన్నుల మేర వచ్చిందని.. గత ఏడాదితో పోలిస్తే 16 వేల మెట్రిక్ టన్నులు ఇది అదనమని అధికారులు సీఎంకు తెలిపారు. కాంప్లెక్స్ ఎరువులు కూడా ప్రస్తుత ఏడాదిలో 2.72 లక్షల మెట్రిక్ టన్నుల మేర వచ్చిందని వివరించారు. గతంతో పోలిస్తే 1.20 లక్షల మెట్రిక్ టన్నులు ఇది అదనమని తెలియచేశారు.దీనిపై స్పందించిన సీఎం రాష్ట్రంలో ఎరువుల లభ్యత ఇంతగా ఉన్నా.. కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని.. ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా యూరియా వినియోగం కూడా లెక్కించాలని అన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆ మేరకు వాటి వినియోగం తగ్గించేలా రైతుల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గించిన రైతులకు రాయితీలు ఇచ్చే అంశంపై ప్రణాళికలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఎవరు ఎంత వినియోగిస్తున్నారనే అంశాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా ఎరువుల వినియోగంపై గణాంకాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 11 ఉద్యాన పంటలకు సంబంధించి సాగు వ్యయానికి తగినట్టే ఆయా పంటలకు కనీస ధర వచ్చేలా చూడాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్ట పోవడానికి వీల్లేదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. మరోవైపు కాఫీ తోటలకు కొత్తగా వచ్చిన బోరర్ తెగులు పై తక్షణమే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. కొత్త తెగులు వచ్చిన కాఫీ పంట 20 ఎకరాల్లో ఉందని...దానిని తక్షణం తొలగించాల్సిన అవసరం ఉందని అధికారులు సీఎంకు తెలిపారు. ఇతర ప్రాంతాలకు తెగులు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. అలాగే తొలగించిన పంటకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని స్పష్టం చేశారు. వచ్చే మూడేళ్ల పాటు- ట్రాప్ లను ఏర్పాటు- చేసి నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా ముఖ్యమంత్రి సూచనలు జారీ చేశారు. మరోవైపు ఉల్లి పంట మొత్తాన్ని కొనుగోలు చేయాల్సిందిగా అధికారులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు చేసిన ఉల్లిని స్థానికంగా కమ్యూనిటి హాళ్లను తీసుకుని ఆరబెట్టాలని సీఎం సూచనలు జారీ చేశారు. ఇప్పటి వరకూ హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లకు సంబంధించి రూ.54 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని .. మరో రూ.59 కోట్లు- చెల్లించాల్సి ఉందని తెలిపారు.

# మనల్ని ఎవరూ ఆపలేరు.. వృద్ధిరేటుపై ప్రధాని మోదీ



ఢిల్లీ: భారత్ పై అమెరికా విధిస్తున్న సుంకాల (ను ఉద్దేశిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతరుల ఆర్థికస్వార్థం వల్ల ఎన్ని సవాళ్లు ఎదురైనా భారత్ 7.8 శాతం వృద్ధిరేటు సాధించిందని చెప్పారు. దేశ ఆర్థికవ్యవస్థ అంచనాలను మించి రాణిస్తోందన్నారు. ఢిల్లీలోని బశోభూమిలో నిర్వహించిన 'సెమీకాన్ ఇండియా 2025' సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత్ మాత్రం స్థిరంగా అభివృద్ధి వైపు ముందడుగు వేస్తోందని ప్రధాని చెప్పారు. ప్రపంచంలోని వివిధ కంపెనీలు మేకిన్ ఇండియా కోసం భారత్‌కు రావాలని, ప్రపంచం కోసం తయారీలు చేపట్టాలని పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వ పాలనలో భారత్‌లో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, విధానాల్లో పారదర్శకత లాంటి పలు మార్పులు చోటుచేసుకున్నాయన్నారు.ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్ త్వరలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించనుందని ప్రధాని విశ్వాసం వ్యక్తంచేశారు. ఈ వృద్ధి కేవలం ఒకే రంగానికి పరిమితం కాకుండా అన్నిరంగాల్లో కనిపిస్తోందని అన్నారు. తాము మేడిన్ ఇండియా ఉత్పత్తులను వినియోగిస్తున్నామని ప్రపంచదేశాలు చెప్పుకునే రోజు త్వరలోనే రానుందని చెప్పారు. సెమీకాన్ ఇండియా 2025 సదస్సులో 40 దేశాల ప్రతినిధులు పాల్గొనడంపై సంతోషం వ్యక్తంచేశారు.ప్రపంచ దేశాలకు భారత్‌పై నమ్మకం పెరిగిందనడానికి ఇదే ఉదాహరణ అని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పోటీ పెరిగిన తరుణంలోనూ భారత్‌కు ఆదరణ తగ్గలేదని చెప్పారు. భారత్‌పై అమెరికా భారీగా పన్నులు విధిస్తున్న నేపథ్యంలో మోదీ మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# అమరావతిలో కీలక నిర్మాణాలు త్వరగా పూర్తి

నగరం ఆకర్షణీయంగా కనిపించేలా నిర్మాణాలు
52వ సీఆర్డీఏ అథార్టీ సమావేశంలో చంద్రబాబు



అమరావతి,సెప్టెంబర్ 1: రాజధానిలో కీలక నిర్మాణ ాలను త్వరితగతిన పూర్తి చేసేలా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మంగ ళవారం సీఎం క్యాంప్ కార్యాల యంలో ముఖ్యమంత్రి నేతృత్వంలో 52వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం జరిగింది. ఏడు అంశాలకు ఈ సమావేశంలో ఆమోదం లభించి ంది. రాజధాని పరిధిలో చేపట్టే కీలక ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేలా స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు, ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు-, స్మార్ట్ ఇండస్ట్రీస్, ఐకానిక్ బ్రిడ్జ్, స్పోర్ట్స్ సిటీ-, రివర్ ఫ్రంట్, రోప్ వే, ఇన్నర్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టుల నిమిత్తం స్పెషల్ పర్పస్ వెహికల్ దోహద పడుతుంది. అయితే ఎస్పీవీ పరిధిలోకి బయో డిజైన్ ప్రాజెక్టును కూడా తీసుకురావాలని ముఖ్య మంత్రి అధికారులకు సూచించారు. స్పోర్ట్స్ సిటీ తరహాలోనే హెల్త్ సిటీ- కూడా అమరావతిలో ఏర్పాటు- కానుందని.. దాని పరిధిలో బయో డిజైన్ ప్రాజెక్టు ఏర్పాటు- చేయాలని సీఎం చెప్పారు. ప్రజారోగ్య సేవల నిమిత్తం బయో డిజైన్ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉండేందుకు ఏడు దేశాలకు చెందిన నిపుణులు, సంస్థలు సిద్దంగా ఉన్నాయని సీఎం తెలిపారు.

# రాజమండ్రి జైల్లో మిథున్ రెడ్డితో పేర్ని నాని ములాఖత్


రాజమండ్రి, సెప్టెంబరు 2 : రాజమండ్రి సెంట్రల్ జైల్లో వైసీపీ రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డితో మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత పేర్ని నాని ఇవాళ(మంగళవారం) ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై ఇద్దరు నేతలు మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. అనంతరం మీడియాతో పేర్నినాని మాట్లాడారు. ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమ కేసులో ఇరికించి అరెస్టు చేశారని.. ఇవాళ ఆయనను పరామర్శించానని చెప్పుకొచ్చారు. మిథున్ రెడ్డిని కూటమి ప్రభుత్వం అరెస్టు చేసి 40 రోజులు అయ్యిందని, ఒక్క రోజు కూడా కస్టడీకి ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు పేర్ని నాని.మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని మానసింగా కుంగదీసేందుకే మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని పేర్ని నాని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ లిక్కర్ స్కాంలో సహా ముద్దాయిలు చెప్పిన ప్రకారం మిథన్ రెడ్డిని అరెస్ట్ చేశారని మండిపడ్డారు. జైల్లో ఉంచినా మిథున్ రెడ్డి కుంగిపోయేది లేదని స్పష్టం చేశారు. మిథున్ రెడ్డి బయటకు వచ్చాక రాజకీయంగా కూటమి ప్రభుత్వానికి చుక్కలు చూపిస్తారని హెచ్చరించారు. చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న పాపాలపై తిరుగుబాటు చేస్తారని పేర్ని నాని వార్నింగ్ ఇచ్చారు.



# వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం

ఏపీ వ్యాప్తంగా ఎల్లో అలర్ట్ జారీ
పలు జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం

విశాఖపట్నం,సెప్టెంబర్ 1: వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు- విశాఖ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఒడిశా పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో బలమైన రుతుపవనాల ద్రోణి కొనసాగుతోంది. దీంతో ఏపీ వ్యాప్తంగా ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఉత్తర కోస్తాలో ఒకటెండు చోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు- వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడన ప్రభావం సుమారు రెండు రోజుల పాటు- కొనసాగుతుందని పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మంగళవారం విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని చెప్పింది. బుధవారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో భారీ వానలు పడొచ్చని తెలిపింది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో శుక్రవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. సోమవారం విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి తదితర జిల్లాల్లో వానలు పడ్డాయి. అత్యధికంగా సాయంత్రం 5 గంటల వరకు విజయనగరం జిల్లా గుర్లలో 76.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇదిలావుంటే జూరాల, ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. దీంతో ఒక గేటు- మూసివేసి ప్రస్తుతం 9 గేట్ల ద్వారా నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులోకి 2,93,723 క్యూసెక్కులు చేరుతుండగా.. 3,34,628 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 881.70 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థం 215.80 టీ-ఎంసీలు కాగా ప్రస్తుతం 197.46 టీ-ఎంసీలుగా కొనసాగుతోందిఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ఏలూరు జిల్లా చింతలపూడి మండల పరిధిలోని తమ్మిలేరు జలాశయానికి భారీగా వరద చేరుతోంది.



# చనిపోయిన నా తల్లిని రాజకీయాల్లోకి లాగారు: మోడీ

ఢిల్లీ: తన తల్లికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ప్రతి తల్లినీ కాంగ్రెస్, ఆర్జెడి అవమానించిందని విమర్శలు గుప్పించారు. తన తల్లిపై రాజకీయ విమర్శలపై ప్రధాని మోడీ స్పందించారు. చనిపోయిన తన తల్లిని కూడా రాజకీయాల్లోకి లాగారని దుయ్యబట్టారు. దూషణలు కేవలం తన తల్లిని అవమానించడమే కాదు అని, దేశంలోని ప్రతి తల్లి, సోదరి, కుమార్తెను అవమానించినట్లేనని పేర్కొన్నారు. ఈ దృశ్యాలు చూసి, మాటలు విని, బిహార్‌లోని ప్రతి తల్లికి ఎంత బాధ కలిగిందో తనకు తెలుసునన్నారు. తన హృదయంలో ఎంత వేదన ఉందో, బిహార్ ప్రజల హృదయాల్లో కూడా అంతే బాధ ఉందని మోడీ వివరించారు. తల్లి అనేది మన లోకం, మన ఆత్మగౌరవమని చెప్పారు. సంప్రదాయాలతో నిండిన బిహార్‌లో ఇలా జరుగుతుందని తాను ఊహించలేదన్నారు. బిహార్‌లో మహిళా స్వయం సహాయ సంఘాలకు వ్యాపార నైపుణ్యాలను నేర్పించడంతో పాటు వారి అభివృద్ధి సహాయం చేస్తామని, వారి ఆర్థిక స్వావలంబనకు కృషి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని మోడీ పేర్కొన్నారు.



## సంపాదకీయం

బుధవారం 03-09-2025

# అమెరికా ఆవల ప్రపంచం

గత ఏడాది కజాన్‌లో జరిగిన సమావేశంతో పోలిస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల మధ్య తియాంజిన్‌లో జరిగిన తాజా మీటింగ్ స్నేహపూరిత వాతావరణంలో జరిగింది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సమావేశం సందర్భంగా జరిగిన ఈ సమావేశాన్ని చరిత్రాత్మకమని చెప్పలేకపోయినప్పటికీ, దీనికి వేరే ప్రాముఖ్యత ఉంది. అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు, సుంకాల యుద్ధాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ఇద్దరు నాయకులు సమావేశమయ్యారు. సంబంధాలను సమతుల్యం చేసుకోవడానికి జాగ్రత్తగా చేసిన ప్రయత్నంగా ఈ సమావేశాన్ని చాలామంది చూస్తున్నారు. ఉమ్మడి ప్రకటనలో, భారత్, చైనాలు అభివృద్ధిలో భాగస్వాములని, ప్రత్యర్థులు కాదని పేర్కొన్నారు. విభేదాలు వివాదాలుగా మారకూడదని కూడా కోరుకున్నారు. 2020లో గల్వాన్ ఘర్షణల నుంచి కొనసాగుతున్న ఉద్రిక్తత నేపథ్యంలో ఇప్పుడు నమ్మకం కలిగించే ప్రయత్నం జరిగింది. ఇద్దరు నాయకులు వాణిజ్యం, సరిహద్దు గురించి మాత్రమే కాకుండా బహుళ ధ్రువ ఆసియా, బహుళ ధ్రువ ప్రపంచం విస్తృత దృక్పథంపై కూడా దృష్టిపెట్టారు. ట్రంప్ టారిఫ్ యుద్ధం కారణంగా భారతదేశం పరిమిత ఆప్షన్ల మధ్య పరిష్కారం కోసం తహతహలాడుతోంది. రష్యా నుంచి తక్కువ ధరలకు చమురు కొంటున్నందుకు శిక్షగా భారత్‌పై అదనపు సుంకాలను అమెరికా సమర్థించుకుంటోంది. నిజానికి, ఈ చర్యలు భారతదేశాన్ని అమెరికా ఉనికి లేని యురేషియా వేదికల వైపుకు తీసుకెళ్తున్నాయి. ఆర్థిక రంగంలో చూసుకుంటే లోటును తగ్గించడం, వాణిజ్యాన్ని పెంచడంపై చర్చలు మరింత ఆశావహంగా కనిపిస్తున్నాయి. వీటిపై నిర్దిష్టమైన చర్చలు జరగలేదుగానీ చైనాతో వ్యాపారం చేయడానికి భారత్ సిద్ధంగా ఉందనే రాజకీయ సందేశం కచ్చితంగా ఉంది. వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ప్రస్తావిస్తూ, మూడో దేశ అభిప్రాయం అన్న భావనను తిరస్కరిస్తూ చైనాతో సంబంధాలను అమెరికా ఒత్తిడికి లోబడి నిర్ణయించబోమన్న సందేశాన్ని యూఎస్‌కు భారత్ ఇచ్చింది. తియాంజిన్‌లో ప్రధాని మోదీ, జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్ ఒకే వేదికపై కలిసి కనిపించినప్పుడు, ఈ ఫోటో కేవలం ఎస్‌సీఓ హాల్‌కు మాత్రమే పరిమితమయిందిగా భావించలేం. ఇది భారతదేశానికి చాలా ముఖ్యమైన సమయం. కొన్ని రోజుల కిందటే, ట్రంప్ భారత ఎగుమతులపై 50 శాతం సుంకాలను విధించారు. మరో వైపు యూఎస్ ఫెడరల్ అప్పీల్ కోర్టు ఈ సుంకాలు చెల్లవని, చట్టవిరుద్ధమని తెలిపింది. అయినప్పటికీ కేసు సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతున్నందున అవి అమలులో ఉంటాయి. ఈ సందర్భంలో, అమెరికా ఆంక్షలు, ఒత్తిడికి లక్ష్యంగా మారిన జిన్‌పింగ్, పుతిన్‌తో కలిసి ఒకే వేదికపై మోదీ కనిపించడానికి ప్రాముఖ్యత ఉంది. ట్రంప్ సుంకాలు చాలా అసహజమైనవని, మోదీ–జిన్‌పింగ్–పుతిన్ తియాంజిన్‌లో ఒకే వేదికపైకి రావడం అమెరికాకు సమాధానం అని, ముగ్గురూ కలిసి అమెరికా విధానాల వల్ల ఏర్పడిన ఒత్తిడిని బలంగా ఎదుర్కోనే అవకాశం ఉంటుంది. ఏడు సంవత్సరాల తర్వాత ప్రధాని మోదీ చైనా వెళ్లారు. ఇది ఒక ప్రాంతీయ సమావేశంలో పాల్గొనే కార్యక్రమం మాత్రమే కాదు. జిన్‌పింగ్‌తో జరిగిన ద్వైపాక్షిక సమావేశం సంబంధాలను సమతుల్యం చేసుకోవడానికి ఒక అవకాశాన్ని కల్పించింది. అదే సమయంలో, భారత్‌కు అమెరికా ఆవల భాగస్వాములు, ఇతర మార్గాలు ఉన్నాయని చూపించడానికి ఒక వేదికను ఎస్‌సీఓ సమావేశం అందించింది. ఎస్‌సీఓను నియంతృత్వ దేశాల గ్రూప్‌గా అమెరికా చూస్తుంటుంది. కానీ భారత్, ఇతర సభ్య దేశాలు దీనితో ఏకీభవించవు. భారత్‌కు, దాని ప్రాముఖ్యత మరోలా ఉంది. భారత్ వైపు నుంచి చూస్తే రష్యా, చైనా, మధ్యాసియా దేశాలు, అలాగే ఇరాన్ కూడా ఒకే టేబుల్ వద్ద కూర్చునే వేదిక. చైనాను భారత్ ప్రత్యర్థిలా కాకుండా భాగస్వామిగా చూడాలనే సందేశాన్ని పంపడానికి ఈ శిఖరాగ్ర సమావేశాన్ని చైనా ఉపయోగించుకుంది. స్థిరత్వం గురించి తరచుగా జరిగే చర్చలు మరింత విశ్వసనీయ సంబంధంగా మారగలవా అన్న విషయంలో భారత్‌కు ఈ సమావేశం ఒక పరీక్ష లాంటిది. భారత్‌లోని ప్రజలు వాస్తవాన్ని అర్థం చేసుకున్నారు. సరిహద్దు వివాదం ఇంకా పరిష్కారం కాలేదు. చైనాతో భారతదేశానికి 99 బిలియన్ ( సుమారు 8 లక్షల 72 వేల 470 కోట్లు) డాలర్ల వాణిజ్య లోటు రాజకీయంగా తలనొప్పిలా మిగిలిపోయింది. అయినప్పటికీ ఎంత కష్టమైనా సరే... చర్చలు అవసరమని భావిస్తున్నారు. ఆరు దేశాల చిన్న గ్రూప్‌గా ప్రారంభమైన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) ఇప్పుడు పది సభ్య దేశాలు, ఇద్దరు పరిశీలకులు, 14 చర్చా భాగస్వాములతో కూడిన సమూహంగా ఎదిగింది. ప్రస్తుతం ఇది ప్రాంతీయ సంస్థకు సంబంధించి అతిపెద్ద భౌగోళిక ప్రాంతానికి, ప్రపంచంలో ఎక్కువమంది జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తోంది. వివిధ దేశాలు ఎలా కలిసి పనిచేయవచ్చో ఎస్‌సీఓ ప్రపంచానికి చూపిస్తోందని ఆయన అంటున్నారు. ఇది ఇంకా పూర్తి కానప్పటికీ, దేశాలు కలిసి వస్తే పరస్పర సహకార పరిస్థితిని బలోపేతం చేయవచ్చునడానికి ఇది రుజువని ఆయన అన్నారు. ఈ సమీకరణంలో రష్యా పాత్ర తక్కువేం కాదు. రష్యా నుంచి భారత్ చౌకైన ముడి చమురును ఎక్కువగా కొనుగోలు చేసే దేశంగా మారింది. ఇలా చేయడం ద్వారా, భారత్ తన పౌరులను ద్రవ్యోల్బణం నుంచి కాపాడింది. ఈ సంవత్సరం రష్యా అధ్యక్షుడు పుతిన్ భారతదేశాన్ని సందర్శించనున్నట్టు కూడా వార్తలు వస్తున్నాయి. ఇది రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది. భారత్‌కు సంబంధించి రష్యా కేవలం చమురు, ఆయుధాల సరఫరాదారు మాత్రమే కాదు.

# రేవంత్ మాస్టర్ మైండ్

**సీబీఐకి అప్పగించడం ద్వారా బీజేపీ కోర్టులోకి బాల్**

**కాళేశ్వరం టెన్షన్ తో గులాబీ దళం**

హైదరాబాద్, సెప్టెంబర్ 2, కాళేశ్వరం కేసు కేంద్ర దర్యాప్తు సంస్థ చేతిలోకి వెళ్ళింది. కేంద్ర దర్యాప్తు సంస్థ చేతిలో కొన్ని వేల కేసులు ఉన్నాయి. ఇప్పటికే జగన్ అక్రమస్తుల కేసు సంవత్సరాలుగా పెండింగ్లోనే ఉంది. ఆయన కూడా బెయిల్ మీదనే ఉన్నారు. వివేక హత్య కేసు కూడా ఇంతవరకు తేలలేదు. ఇవే కాదు ఇంకా చాలా కేసుల్లో కూడా సిబిఐ అడుగులు అంత వేగంగా లేవు. సిబ్బంది కొరత కూడా కేంద్ర దర్యాప్తు సంస్థను తీవ్రంగా వేధిస్తోంది. ఇదే సమయంలో కాళేశ్వరం కేసు సిబిఐ చేతిలోకి వెళ్ళింది.. ఈ కేసు ఇప్పుడు తేలుతుందా? ఇప్పటికిప్పుడు శిక్ష పడుతుందా? అనే ప్రశ్నలు పక్కన పెడితే.. తెలంగాణ ముఖ్యమంత్రిని గులాబీ పార్టీ తక్కువ అంచనా వేసింది. ఇప్పటికీ కూడా రేవంత్ తమను ఏమీ చేయలేరనే ధీమాలోనే గులాబీ పార్టీ ఉందివాస్తవానికి తెలంగాణ ముఖ్యమంత్రి తన రాజకీయ భవిష్యత్తును మొత్తం తమ పార్టీ మీదనే నిర్మించుకున్నాడనే విషయాన్ని గులాబి నేతలు విస్మరిస్తున్నారు.. పింకు పార్టీ ప్రెసిడెంట్, వర్కింగ్ ప్రెసిడెంట్ వ్యవహరించిన తీరు వల్లే ఆయన ఒక్కసారి గా తెలంగాణలో హీరో అయిపోయాడు. కెసిఆర్ కు ప్రత్యామ్నాయ నాయకుడిగా ఎదిగాడు.. కాంగ్రెసులో గొప్ప గొప్ప నాయకులు ఉన్నప్పటికీ కొడంగల్ శాసనసభ్యుడిని అధిష్టానం ముఖ్యమంత్రి ని చేయాలని భావించిందంటే.. అతని స్టామినా ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు చూస్తున్న రాజకీయ ప్రణామాలను పరిశీలిస్తే తెలంగాణ సీఎం సాధారణ రాజకీయ నాయకుడిగా కాకుండా అసాధారణ వ్యక్తిగా ఎదుగుతున్నట్టు అర్థమవుతుంది. కేంద్ర దర్యాప్తు సంస్థ విషయంలో ప్రతిపక్షాలు భయపడి సాధారణ సమ్మతిని కూడా రద్దు చేశాయి. ఇలాంటి స్థితిలో ధైర్యంగా జీవో నెంబర్ 51 ను వెనక్కి తీసుకున్నాడు తెలంగాణ ముఖ్యమంత్రి. కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి తనను తాను.. తన పార్టీని కూడా రక్షించుకోగలను అనే ధీమా అతడిలో ఉంది. ఒక రకంగా ఇది రాహుల్ వల్ల కూడా కాలేదు. రాహుల్ లాంటి వ్యక్తి కేంద్ర దర్యాప్తు సంస్థలను నిందిస్తున్న వేళ.. తెలంగాణ సీఎం వేసిన అడుగులు ఆశ్చర్యకరం. రేవంత్ కంటే కూడా ఢిల్లీలో బలం ఎక్కువగా ఉన్న నాయకుడిగా చంద్రబాబు పేరు గడించాడు. అటువంటి వ్యక్తి కూడా కేంద్ర దర్యాప్తు సంస్థ విషయంలో 2019లో జాగ్రత్త పడితే.. రేవంత్ మాత్రం ఏ మాత్రం భయం లేకుండా వ్యవహరిస్తున్నాడు.. కేంద్ర దర్యాప్తు సంస్థ కాళేశ్వరం విషయంలో ముందుకు వెళితే.. ఒకవేళ అక్కడే ఆగిపోతే తెలంగాణ ముఖ్యమంత్రికి వచ్చే ఇబ్బంది లేదు. అంతేకాదు రాజకీయంగా ఆయనకు అనేకంగా లాభాలు ఉన్నాయి. ఒకవేళ అనుకున్న పలుకుబడితో కేసీఆర్ నిర్దోషి అని చెప్పించుకున్నప్పటికీ.. తన దగ్గర ఉన్న ఆధారాలను తెలంగాణ ముఖ్యమంత్రి మొహమాటం లేకుండా బయటపడతాడు. ఇటీవల నేషనల్ సర్కిల్స్ లో జరిగిన చర్చ ప్రకారం.. కేంద్రంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు ఏ స్థాయిలో పట్టు ఉందో.. తెలంగాణ ముఖ్యమంత్రి కి కూడా అదే స్థాయిలో పట్టు ఉంది. ఇటీవల పార్లమెంటు ఎన్నికల్లో మైండ్ గేమ్ ను ప్రదర్శించిన తెలంగాణ సీఎం.. గులాబీ పార్టీకి ఒక్క సీటు కూడా రాకుండా చేశాడు. చాలామంది అనుకుంటున్నట్టుగా తెలంగాణ త్రీ గోర్జెస్ విషయంలో తెలంగాణ సీఎం టార్గెట్ అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి కాదు. ఇప్పటికీ అతడు రక్షణాత్మక ధోరణిలోనే ఉన్నాడు.. ఒకవేళ ఈ కేసులో ఆయనను అరెస్ట్ చేసే అవకాశం ఉన్నప్పటికీ.. ఆయన దానిమీద దృష్టిసారించలేదు. గులాబీ పార్టీపై సానుభూతి పెంచడం ఎందుకు అన్నట్టుగానే తెలంగాణ ముఖ్యమంత్రి వ్యవహరించినట్టు తెలుస్తోంది.. అందువల్లే అత్యంత తెలివిగా బంతిని కేంద్రం కోర్టులో వేశాడు. ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థకు ఇచ్చే విషయంలో.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వేం నరేందర్ రెడ్డి కి మినహా మిగతా ఎవరికి కూడా సమాచారం లేదు. అంతేకాదు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను కూడా తెలంగాణ ముఖ్యమంత్రి అత్యంత సీరియస్ గా తీసుకున్నాడు. అజహారుద్దీన్ కు ఉన్నట్టుండి ఎమ్మెల్సీ ఇచ్చాడు. ఒకరకంగా ఇది గులాబీ పార్టీకి రేవంత్ ఇచ్చిన మాస్టర్ స్ట్రోక్. అజహారుద్దీన్ కు టికెట్ ఇస్తే దివంగత ఎమ్మెల్యే భార్యను బరిలోకి దింపి గెలుద్దామని.. తద్వారా రేవంత్ పరిపాలనను ప్రజలు తిరస్కరిస్తున్నారని గులాబీ పార్టీ ప్రచారం చేద్దామనుకుంది. కానీ ఆ ప్రచారానికి చెక్ పెట్టాడు రేవంత్.. అంతేకాదు మాజీ క్రికెటర్ కు ఎమ్మెల్సీ ఇచ్చి.. గడచిన ఎన్నికల్లో ఓడిపోయిన నవీన్ యాదవ్ కు టికెట్ కన్ఫామ్ చేశాడు. స్థూలంగా చెప్పాలంటే కాళేశ్వరం ఇప్పట్ల తేలకపోవచ్చు.

# మోదీ జీఎస్టీ సంస్కరణలు ఊరటనిస్తాయా?

ముంబై, సెప్టెంబర్ 2, భారత దేశ ఎదుగుదలను అగ్రరాజ్యం అమెరికా ఓర్వలేకపోతోంది. ముఖ్యంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అయితే గుండెల్లో దడ మొదలైంది. దీంతో ఎలాగైనా భారత్‌ను దెబ్బ కొట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలోనే అనేక విధాలుగా ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు. మోదీని లొంగదీసుకోవాలని భావించారు. కానీ కుదరకపోవడంతో ఇప్పుడు ఆర్థికంగా దెబ్బకొట్టేందుకు టారిఫ్‌లు విధించారు. 50 శాతం టారిఫ్‌ల ప్రభావం భారత ఎగుమతులపై తీవ్రంగా పడింది. అయితే భారత్ ఇది తాత్కాలికమే అని భావిస్తోంది. ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తోంది. ఈ క్రమంలో తక్షణ నష్టం జరుగకుండా ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ సంస్కరణలు చేపట్టారు. అయితే ఇవి ఏమేరకు ఊరటనిస్తాయి అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా నుంచి చమురు కొనుగోళ్ల కారణంగా భారత ఉత్పత్తులపై 50% టారిఫ్స్ విధించామని చెప్పారు. అయితే మనకన్నా ఎక్కువ దిగుమతి చేసుకుంటున్న చైనా జోలికిమాత్రం వెల్లడం లేదు. టారిఫ్‌ల ప్రభావంతో భారత్‌లోని టెక్స్‌టైల్స్, ఆభరణాలు, లెదర్, సీఫుడ్ వంటి రంగాల్లో సుమారు 60 బిలియన్ డాలర్ల ఎగుమతులు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ రంగాలు శ్రామిక?ఆధారితమైనవి కావడంతో లక్షలాది ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయి. ఈ క్రమంలో టారిఫ్స్ ప్రభావాన్ని తగ్గించేందుకు మోదీ సర్కారు జీఎస్టీ సంస్కరణలను ప్రకటించింది. రెండు స్లాబుల జీఎస్టీ వ్యవస్థ (5%, 18%)ను ప్రవేశపెట్టి, దీపావళి నాటికి పన్ను భారం తగ్గించనున్నారు. ఈ సంస్కరణలు దేశీయ వినియోగాన్ని పెంచి, జీడీపీని 0.6% ఉత్తేజితం చేయవచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. అయితే, ఈ చర్యలు ఎగుమతి రంగంలో నష్టాలను పూర్తిగా భర్తీ చేయలేవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. టారిఫ్‌ల కారణంగా టెక్స్‌టైల్స్, ఆభరణాల వంటి శ్రామిక?ఆధారిత రంగాల్లో ఉద్యోగ నష్టాలు తప్పవు. సూరత్, నోయిడా, తిరుప్పూర్ వంటి ఎగుమతి కేంద్రాల్లో లక్షలాది ఉద్యోగాలు ప్రమాదంలో ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆర్థికవేత్త సాక్షి గుప్తా జీడీపీ 6% కంటే తగ్గవచ్చని, నిరుద్యోగం పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఎన్డీఏ సర్కారు ముందున్న సవాళ్లలో ఎగుమతి నష్టాలను భర్తీ చేయడం, శ్రామిక రంగాలను కాపాడటం, దేశీయ వినియోగాన్ని పెంచడం ప్రధానమైనవి. వాణిజ్య ఒప్పందాల ద్వారా యూరోప్, ఆఫ్రికా, ఆసియా మార్కెట్లలో విస్తరణ, ఎస్‌ఈజెడ్ సంస్కరణలు, ఎగుమతి ప్రోత్సాహకాలు అవసరం. ఇదే సమయంలో మోదీ “స్వదేశీ” ఉద్యమాన్ని ప్రోత్సహిస్తూ, దేశీయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ వ్యూహం దీర్ఘకాలంలో ఆత్మనిర్భర భారత్‌ను నిర్మించగలదు. కానీ తక్షణ ఎగుమతి నష్టాలను భర్తీ చేయడం కష్టం. రష్యాతో వాణిజ్యాన్ని కొనసాగించేందుకు భారత్ నిర్ణయం దౌత్యపరమైన సవాళ్లను తెచ్చిపెడుతోంది.

# 2వేల 200 కోట్లతో ఆలయాలకు మాస్టర్ ప్లాన్

హైదరాబాద్, సెప్టెంబర్ 2, తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రధాన ఆధ్యాత్మిక క్షేత్రాలను అభివృద్ధి చేయడానికి భారీ ప్రణాళికలను రూపొందిస్తోంది. భవిష్యత్తులో పెరగనున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రణాళికలను అమలు చేయనుంది. దేవాలయాల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన కోసం దేవాదాయ శాఖ రూ. 2,202.35 కోట్ల వ్యయాన్ని అంచనా వేసింది. ఇందులో బాసర, భద్రాచలం, జోగులాంబ సహా 8 ప్రధాన దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించనున్నారు. ధర్మపురిలోని లక్ష్మీనర్సింహస్వామి, మేడారంలోని సమ్మక్క సారలమ్మ ఆలయాల అంచనా వ్యయంపై స్పష్టత రావాల్సి ఉంది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన మహాలక్ష్మి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కారణంగా రాష్ట్రంలోని దేవాలయాలకు వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతమున్న సౌకర్యాలు సరిపోకపోవడంతో ఈ మాస్టర్‌ప్లాన్ అవసరం అని ప్రభుత్వం భావించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్‌రావు ఈ అభివృద్ధి ప్రణాళికలను తయారు చేస్తున్నారు. ఈ ప్రణాళికల్లో భాగంగా రహదారుల విస్తరణ, పార్కులు, ట్రాఫిక్ నిర్వహణ, అన్నదాన కేంద్రాలు, అగ్నిమాపక సేవలు, క్యూలైన్ కాంప్లెక్స్‌లు, బ్రహ్మోత్సవాలలో సాంస్కృతిక కార్యక్రమాల కోసం వసతులు కల్పించనున్నారు. బాసర జ్ఞాన సరస్వతి దేవస్థానాన్ని నాలుగు దశల్లో రూ. 189.10 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించి, ముఖ్యమంత్రి ఆమోదం కోసం పంపించారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానాన్ని నాలుగు దశల్లో రూ. 696.25 కోట్లతో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానాన్ని మూడు విడతల్లో రూ. 350 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయింది, కలెక్టర్ నుంచి తుది ప్రతిపాదనలు అందాల్సి ఉంది. ఇవే కాకుండా, రాష్ట్రంలోని ఇతర దేవాలయాలకు కూడా మాస్టర్‌ప్లాన్‌లు సిద్ధమవుతున్నాయి. ఈ ప్రణాళికల అమలుతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మార్చడంలో దోహదం చేస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల పురోగతిపై మరిన్ని వివరాలు త్వరలో వెలువడే ఛాన్స్ ఉంది.

# పొంచి ఉన్న ప్రమాదం

హైదరాబాద్, సెప్టెంబర్ 2, తెలంగాణను భారీ వరదలు ముంచెత్తాయి. గత కొద్ది రోజుల నుంచి భారీ వర్షాలు పడుతుండటంతో పాటు క్లౌడ్ బరస్ట్ జరగడంతో కొన్ని జిల్లాల్లో నీరు నిలిచిపోయింది. అనేక ప్రాంతాలు నీట మునిగిపోయాయి. ప్రధానంగా మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో వరద తీవ్రత ఎక్కువగా ఉంది. వరద నీరు ఇంకా తొలిగిపోలేదు. ఇంకా కొన్ని ప్రాంతాలు నీటిలోనే నానుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో వరద నీరు తొలిగిపోలేదు. కొద్దిగా శాంతించిన చోట ఇళ్లలో బురద పేరుకుపోయింది. దీంతో వ్యాధుల వ్యాప్తి జరిగే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతుంది. కలుషిత నీరు తాగడంతో పాటు దోమల కారణంగా అనేక రకాలైన వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నాయని వైద్య నిపుణులు చెబుతన్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు మరియు వరదలు తెలంగాణను అతలాకుతలం చేశాయి. నదులు, వాగులు, కాల్వలు ఉప్పొంగాయి. రైల్వే ట్రాక్ లు కూడా కొట్టుకుపోయాయి. పంట పొలాలల్లో ఇసుక మేట వేసింది. ఇళ్లలోకి నీరు చేరి బురద మయంగా మారింది. ఇప్పుడిప్పుడే పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు బయలుదేరిన వారు కొందరయితే మరికొందరు వరద నీటిలోనే ఇళ్లలోనే కాలం గడుపుతున్నారు. మెదక్ జిల్లాలో రెండు రోజుల పాటు అరవై సెంటీమీటర్ల వర్షపాతం నమోదయిందని వాతావరణ శాఖ చెప్పింది. ఇళ్లూ, వాగులూ ఏకమయ్యాయి. అయితే ఇప్పుడు వరద తగ్గుముఖం పట్టినా వ్యాధుల ప్రమాదం పొంచి ఉందని ఆందోళన అధికంగా ఉందివరదల తర్వాత ఎక్కడైనా వ్యాధులు సులువుగా సంక్రమిస్తాయి. కలుషిత నీటిని తాగడం వల్ల, దోమల కారణంగా అనేక రకాల వ్యాధులు వస్తాయి. అందులోనూ పశువులు కూడా పెద్ద సంఖ్యలో మరణించడంతో జంతు కళేబరాలనుంచి వచ్చే ఇన్ ఫెక్షన్లు కూడా మనుషులకు సోకే ప్రమాదముంది. ప్రజారోగ్యం ఇప్పుడు ప్రమాదంలో పడినట్లయింది. వరద నీరు ఎక్కువ కాలం నిలిచిపోవడం వల్ల దోమల వ్యాప్తితో చికెన్ గున్యా, కలరా, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సంక్రమించే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే వరద బాధిత ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, అలాగే రక్షిత మంచినీటిని వరద బాధితులకు కొన్ని రోజుల పాటు అందచేయాలని కోరుతున్నారు.

# 12 గంటల పాటు తిరుమల శ్రీవారి ఆలయం మూసివేత

చంద్రగ్రహణం కారణంగా సెప్టెంబర్ 7వ తేదీ సాయంత్రం 3.30 నుంచి మరుసటిరోజు తెల్లవారుజామున అనగా సెప్టెంబర్ 8వ తారీఖు 3 గంటల వరకు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని సుమారు 12గం పాటు మూసివేయనున్నారు. సెప్టెంబర్ 7వ తేదీ ఆదివారం రాత్రి 9.50 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై సెప్టంబర్ 8న సోమవారం వేకువజామున 1.31 గంటలకు పూర్తవుతుంది. సాధారణంగా గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. సెప్టంబర్ 8న ఉదయం 3 గంటలకు సుప్రభాతంతో ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహించనున్నారు. కాగా ఉదయం 6 గంటలకు శ్రీవారి దర్శనం భక్తులకు పునః ప్రారంభవుతుంది. సెప్టంబర్ 7న ఆర్జితసేవలు రద్దుచంద్రగ్రహణం కారణంగా సెప్టంబర్ 7వ తేదీ ఆదివారం ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. సెప్టంబర్ 7న తిరుమలలో అన్నప్రసాద వితరణ కేంద్రాలు మూతచంద్రగ్రహణం కారణంగా సెప్టంబర్ 7న ఆదివారం సాయంత్రం 3 గంటల నుండి తిరుమలలో అన్నప్రసాదాల వితరణ వుండదు. తిరిగి సెప్టంబర్ 8వ తేది ఉదయం 8.30 గంటలకు అన్నప్రసాదాల పంపిణి పున: ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, ఎస్వీ ఉద్యోగుల క్యాంటీన్, శ్రీ పద్మావతి విశ్రాంతి భవనం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2, పీఏసీ-2 లలో అన్నప్రసాదాల వితరణ ఉండదు. భక్తుల సౌకర్యార్థం ముందస్తుగా టీటీడీ అన్నప్రసాదం విభాగం ఆధ్వర్యంలో 30 వేల పులిహోర ప్యాకెట్లను సెప్టెంబర్ 7 సాయంత్రం 4.30 గంటల నుండి పంపిణి చేయనున్నారు. ఇందులో భాగంగా శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న వైభవోత్సవ మండపం, రామ్ భగీచా, పీఏసీ-1, సీఆర్వో, ఏఎన్సీ ప్రాంతాల్లోని ఫుడ్ కౌంటర్లు, శ్రీవారి సేవా సదన్ వద్ద భక్తులకు అన్నప్రసాదం ప్యాకెట్లను అందిస్తారు. శ్రీ వారి భక్తులు ఈ విషయాలను గమనించి తమ తిరుమల యాత్ర ప్రణాళికను రూపొందించుకోవాల్సిందిగా కోరడమైనది.

# లోకల్ కండిషన్స్ ఫాలో అవ్వాల్సిందే

హైదరాబాద్, సెప్టెంబర్ 2, తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక రిజర్వేషన్ విధానం అమల్లో ఉంది. ఇది స్థానిక, స్థానికేతర విద్యార్థుల మధ్య సమాన అవకాశాలను కల్పించడానికి రూపొందించబడింది. ముఖ్యంగా వైద్య విద్య చదవాలనుకునే వారికి సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో చదివిన వారు మాత్రమే స్థానికులుగా పరిగణించబడతారని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు ప్రకారం నాలుగేళ్ల విద్యను రాష్ట్రంలోనే అభ్యసించాలి. ఇది వరకు తెలంగాణ రాష్ట్ర హైకోర్టు సింగిల్ జడ్జి, డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను చీఫ్ జస్టిస్ బీఆర్ గవాన్ నేతృత్వంలోని ధర్మాసనం పక్కన పెడుతూ ఈ సంచలన తీర్పును వెలువరించింది. తెలంగాణ లో వైద్య విద్యలో స్థానికతకు ప్రాధాన్యం ఇవ్వాలన్న అంశంపై సుదీర్ఘకాలంగా చర్చ సాగింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 33 ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని ఈ తీర్పులో వెల్లడించింది. దీని వ్ ఎంసీహెచ్, ఎంఎస్, ఎంబీబీఎస్, పీజీ కోర్సుల్లో స్థానిక అభ్యర్థులకే ప్రాధాన్యం లభిస్తుంది. కనీసం నాలుగేళ్లపాటు ఆ రాష్ట్రంలో చదివినవారే స్థానికులుగా అర్హత సాధిస్తారని కోర్టు స్పష్టం చేసింది. దీంతో తెలంగాణలో చదివిన విద్యార్థులకే మెడికల్ కాలేజీల్లో సీట్లు పొందడంలో అధిక అవకాశం ఉంటుంది. ఇతర రాష్ట్రాల అభ్యర్థులు మాత్రం కేవలం ఆల్ ఇండియా కోటా కింద లభించే 15 శాతం సీట్లకే అర్హులు అవుతారు. మిగిలిన 85 శాతం సీట్లు పూర్తిగా స్థానిక విద్యార్థులకే కేటాయించబడతాయి. న్యాయమూర్తుల అభిప్రాయం ప్రకారం వైద్య విద్య ఒక రాష్ట్ర ప్రజల అవసరాలకు అనుసంధానమై ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల కొరతను పూరించాలంటే.. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరమని పేర్కొన్నారు.

# కవితపై చర్యలు తప్పవా...



హైదరాబాద్, సెప్టెంబర్ 2, కల్వకుంట్ల కవిత మరోసారి బీఆర్ఎస్ పై బాణం ఎక్కుపెట్టారు. అయితే ఈసారి నేరుగా పేర్లు బయటపెడుతూ విమర్శలు చేయడంతో పార్టీ రాజకీయంగా ఇబ్బందుల్లో పడినట్లయింది. కాళేశ్వరం కమిషన్ నివేదికపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. ఈసారి నేరుగా హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని ఆమె మీడియా సమావేశంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇద్దరు, ముగ్గురు నేతలు కలసి కేసీఆర్ పై కుట్రలకు పాల్పడ్డారని కల్వకుంట్ల కవిత అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో హరీశ్ రావు, సంతోష్ రావుది కీలక పాత్ర అని ఆమె చెప్పారు. వీరిద్దరి వెనక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని, వారిని కాపాడుతున్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని చెప్పారు. తాను ఇప్పుడు మాట్లాడితే తన వెనక ఎవరో ఉన్నారంటారని, కానీ ఆ అవినీతి అనకొండల మధ్య కేసీఆర్ బలిపశువుగా మారారని కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నదీ వారేనని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు బాధ్యుడిని చేస్తూ కేసీఆర్ పై సీబీఐ విచారణ చేసిందని, తన కడుపు మండిపోతుందని ఆమె ఆవేదన చెందారు. తన తండ్రికి డబ్బు, తిండిపై ఏనాడూ ఆశ లేదని, కేసీఆర్ పరువు పోతే ఆ బాధ తమకు ఉంటుందని చెప్పుకొచ్చారు కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో హరీశ్ రావుది కీలక పాత్ర అని అన్నారు. అందుకే నాడు హరీశ్ రావు ను నాడు నీటిపారుదల శాఖ మంత్రిగా తొలగించారని చెప్పారు. తనను అడ్డుకుంటే బిడ్డా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. హరీశ్ రావు, సంతోష్ రావు వల్లే తమ పార్టీ అధినేత కేసీఆర్ కు ఈ పరిస్థితి దాపురించిందని ఆమె ఆవేదన చెందారు. కేసీఆర్ ను అడ్డంపెట్టుకుని వీళ్లిద్దరూ భారీగా ఆస్తులు కూడబెట్టారన్న కవిత, వారిద్దరికీ డబ్బులు మాత్రమే కావాలని ఆవేదన చెందారు. అయితే దీనిపై బీఆర్ఎస్ పార్టీ వెంటనే ఎక్స్ లో స్పందించింది. హరీశ్రావును ఆరడుగుల బుల్లెట్ అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పేర్కొంది. కవిత కామెంట్స్ తర్వాత ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కు బీఆర్ఎస్ నేతలు బయలుదేరి వెళ్లారు. కేటీఆర్ తో పాటు మధుసూదనాచారి, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదశ్వర్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి కేసీఆర్ తో సమావేశమై కవిత వ్యాఖ్యలపై చర్చిస్తున్నారు. కవితపై ఇక చర్యలకు దిగే అవకాశముందని తెలిసింది.కవిత చేస్తున్న వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. తాజాగా తన బావ, మాజీ మంత్రి, సొంతపార్టీలో అత్యంత కీలకనేత హరీష్ రావు పైనే తీవ్ర ఆరోపణలు చేసి పొలిటికల్ హీట్ పీక్స్ కు తీసుకెళ్లారు. అంతేకాదు ఎంపీ సంతోష్ పై కూడా తీవ్ర స్దాయిలో విరుచుకుపడ్డారు కవిత. కాలేశ్వరం నిర్మాణంలో హరీష్ రావు అవినీతికి పా?ల్పడలేదా.. అంటూ విమర్శలు మొదలు పెట్టిన కవిత సంతోష్ ,హరీష్ రావు ఇద్దరూ కలసి తన తండ్రి కేసీఆర్ పై అవినీతి మరకలు అంటించే ప్రయత్నం చేస్తున్నారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు మరో అడుగు ముందుకేసి వీరిద్దరి వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారంటూ రెచ్చిపోయారు. బీఆర్ ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు, ఎంపీ సంతోష్ పార్టీలో కీలక నేతలు, కేసీఆర్ కు అత్యంత సన్నిహితులు. హరీష్ రావు అయితే ఇంక చెప్పక్కర్లేదు. పార్టీలో కేసీఆర్ తరువాత కీలక నిర్ణయాలు తీసుకునేది కేటీఆర్, హరీష్ లే. మరి అంతలా పార్టీకి విధేయతగా ఉండే హరీష్ రావుపై కవిత చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీలోనే కాదు, తెలంగాణ రాజకీయాల్లో పొలిటికల్ తుఫాన్ కు కారణమైయ్యాయి. కాలేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై తాజాగా సిబిఐ ఎంక్వరీకి సిఫార్సు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. దీనిపై మీడి?యా సమావేశం ఏర్పాటు చేసిన కవిత, బిఆర్ ఎస్ కు మద్దతుగా మాట్లడుతారని అంతా అనుకున్నారు. టార్గెట్ కాంగ్రెస్ గా ఆమె ప్రసంగం ఉంటుందని ఊహించారు. కానీ అందరి లెక్కలు తలకిందులైయ్యేలా సొంత పార్టీ బీఆర్ ఎస్ పై , నేరుగా బావ హరీష్ రావులనే విమర్శలతో ఢీ కొట్టింది కవిత.గతంలో బీఆర్ ఎస్ లో నెలకొన్న అసంతృప్తిపై కేసీఆర్ కు కవిత రాసిన లేఖతో మొదలై చిచ్చు, తాజాగా హరీష్ రావు,సంతోష్ పై చేసిన విమర్శలతో అగ్నిపర్వతం బద్దలైనట్లుగా సెగలు పుట్టిస్తోంది. తన తండ్రికి లేఖ, లీక్ తరువాత మీడియాతో మాట్లడిన కవిత బిఆర్ఎస్లో తన తండ్రి కేసీఆర్ దేవుడని, ఆయన చుట్టూ కొన్ని దెయ్యాలున్నాయని, ఆ దెయ్యాల వల్ల పార్టీ నష్టపోతోందని గతంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ తరువా?త అనేకసార్లు నేరుగా పార్టీపై విమర్శలు చేసినప్పటికీ ఒక్క జగదీష్ రెడ్డి ప్రస్తావన తప్ప, బీఆర్ ఎస్ లో ఎవరినీ పేర్లు చెప్పలేదు. నేరుగా పేర్లు ప్రస్తావించి తీవ్ర స్దాయిలో విమర్శించలేదు. తాజాగా కవిత మాట్లడుతూ హరీష్ ,సంతోష్ వారి స్వార్ధం కోసం తన తండ్రిని వాడుకున్నారని, ఇప్పుడు సిబిఐ ఎంక్వరీ వరకూ పరిస్దితి తీసుకొచ్చారని విరుచుకుపడ్డారు. కవిత తాజాగా విమర్శల నేపధ్యంలో బిఆర్ ఎస్ లో విభేదాలు పీక్స్ చేరుకున్నాయని క్లారిటీ వచ్చినట్లయ్యింది. అంతేకాదు సొంత బావ హరీష్ రావుతో ఇకపై డైరెక్ట్ పొలిటికల్ వా?ర్ కు తాను సిద్దంగా ఉన్నాననే సంకేతాలిచ్చినట్లుగా తెలుస్తోంది. ఈరోజు వరకూ కేటీఆర్ కు కవితకు మధ్య చెడిందని, కేటీఆర్ పై కక్షతోనే ఇలా మాట్లడుతోందనే ఊహాగానాలకు చెక్ పెట్టేలా తెరపైకి హరీష్ పేరు తెచ్చి, నా కక్ష అన్నపై కాదు బావపై అన్నట్లుగా కవిత వ్యాఖ్యలతో ఓ క్లారిటీ వచ్చిందనే టాక్ వినిపిస్తోంది. కవిత వ్యాఖ్యలు తరువాత బీఆర్ ఎస్ లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. కేసీఆర్ పై సిబిఐ ఎంక్వరీ వేసిన తరువాత బిఆర్ ఎస్ పార్టీ ఉంటే ఎంత , పోతే ఎంత.. అంటూ కవిత అన్న మాటలు ఏకంగా పార్టీనేతల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైనట్లు తెలుస్తోంది. కవిత వర్సెస్ హరీష్ రావు వివాదంలో పార్టీ మద్దతు హరీష్ కే నంటూ బిఆర్ ఎస్ సోషల్ మీడియా పోస్టుల ద్వారా క్లారిటీ ఇస్తోంది. ఇదిలా ఉంటే కాలేశ్వరం పై సిబిఐ అంటూ కాంగ్రెస్ పా?ర్టీ ఇచ్చిన ఊహించని షాక్ లో ఉన్న బిఆర్ ఎస్ నేతలకు అంతకు మించి అన్నట్లుగా తాజాగా కవిత చేసిన విమర్శలపై హరీష్ రావు, సంతోష్ లు ఎలా స్పందిస్తారో చూడాలి.

## సమస్యల పరిస్కారం కోసం తహసీల్దార్ కు వినతిపత్రం

జయశంకర్ భూపాలపల్లి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మహాదేవపూర్ మండల సమష్యాల పరిష్కారం కోసం ఆర్ఐ కి వినతిపత్రం సమర్పించారు. ,అనంతరం మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్ మాట్లాడుతూ... మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ సామజిక హాస్పిటల్ ను 30పడకల నుండి 50పడకలకు పెంచాలని, అన్నారం బ్యారేజ్ బ్యాక్ వాటర్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం చెల్లించి, మళ్ళీ ఇలాంటి పరిస్థితి రాకుండా శాశ్వత పరిస్కారం చూపాలని,మహాదేవపూర్ మండల కేంద్రంలో మోడల్ స్కూల్ ఏర్పాటు చెయ్యాలని, మండల కేంద్రంలోని బస్సు స్టాండ్ నుండి శివాజీ చావుక్ వరకు రోడ్ వెడల్పు చేసి సెంటర్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చెయ్యాలని, బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేసి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, అభివృద్ధి దూరమవుతున్న గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించాలని, యూరియా కొరత ఇబ్బంది పడుతున్నారు రైతులకు వెంటనే యూరియా నిలువలను అందుబాటులోకి తీసుకురావాలని, కొత్త పింఛన్ల విషయం ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరి వీడి వెంటనే కొత్త పింఛన్ మంజూరు చేయాలని, కౌలు రైతుకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం తమ మాట నిలబెట్టుకోవాలని, రాష్ట్రంలోనీ ప్రతి మహిళకు నెలకి 2500రూపాయలమహాలక్ష్మి పథకం వెంటనే అమలు చేయాలని, వికలాంగులకు రు. 6000మరియు చేయూత పింఛన్ లు రు. 4000రూపాయలు ఫించన్ వెంటనే అమలు చెయ్యాలని,ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కేవలం మండలంలోని ఒక పైలట్ గ్రామమే కాకుండా అన్ని గ్రామాల్లో ఈ పథకం అమలు చేయాలని,రాష్ట్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో, వెంటనే స్పందించి మా డిమాండ్లను నెరవేర్చాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ నెంబర్ ఆకుల శ్రీధర్, మాజీ మండల అధ్యక్షులు, సిరిపురం శ్రీమన్నారాయణ,ఉపాధ్యక్షులు అంకరి రాజేందర్, మండల కార్యదర్శులు:గుజ్జుల శంకర్, లింగంపల్లి వంశిధర్ రావు, బల్ల శ్రావణ్ కుమార్,కోశాధికారి ఉదారి పూర్ణచందర్,కార్యదర్శి బంధుగుల సంతోష్,కిసానమోర్చా మండల అధ్యక్షులు ఓడేటి బాలిరెడ్డి,మండల నాయకులు కన్నెబోయిన ఐలయ్య, దాడిగేలా వెంకటేష్, ఆడప లక్ష్మీనారాయణ, కొక్కు రాకేష్, నేన్నాల రాకేష్, హరీష్,కార్యకర్తలు పాల్గొన్నారు

## ముసాయిదా ఓటరు తుది జాబితా విడుదల



కట్టంగూర్, సెప్టెంబర్ 2 : కట్టంగూర్ మండలంలోని 22 గ్రామ పంచాయతీల తుది ఓటరు జాబితాను మంగళవారం ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు విడుదల చేసి నోటీసు బోర్డులో ప్రదర్శించారు. మండలంలోని 206 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం ఓటర్లు 37,362 మంది ఉండగా అందులో పురుషులు 18,565, స్త్రీలు 18,797 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీజీ స్వరూపారాణి, కార్యాలయ పర్యవేక్షకుడు చింతమల్ల చలపతి, సీనియర్ అసిస్టెంట్ సులోచన. కట్టంగూర్ పంచాయితీ కార్యదర్శి వడ్లకొండ అశోక్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

## 21 నుంచి బతుకమ్మ సంబరాలు


హైదరాబాద్ సెప్టెంబర్ 2,తెలంగాణలో మహిళలు ఎంతో ఇష్టంగా జరుపుకునే పండగ బతుకమ్మ. తొమ్మిది రోజులు జరిగే ఈ వేడుకలో ప్రతి రోజు వేర్వేరు పువ్వులతో అలంకరించిన బతుకమ్మను మహిళలు సాంప్రదాయ వేషధారణలో సమర్పిస్తారు. పాటలు, నృత్యాలతో సంతోషాన్ని పంచుకుంటారు. ఈ ఏడాది సెప్టెంబర్ 21న రామప్ప ఆలయంలో ప్రారంభమై.. 30న పరేడ్ లో ముగుస్తాయి. ఇక 'ఫ్లోటింగ్ బతుకమ్మ' కార్యక్రమం, అంతర్జాతీయ అతిథుల భాగస్వామ్యం ద్వారా పండుగను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేయనున్నారు. పర్యాటక రంగానికి విస్తృత ప్రచారం కలుగుతుంది.తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు అత్యంత ఆతృతగా ఎదురుచూసే పండుగల్లో బతుకమ్మ ఒకటి. ఇది కేవలం పూలతో చేసే ఆరాధన మాత్రమే కాకుండా.. సాంస్కృతిక ఉత్సవం, సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చే ఒక వేదికగా నిలుస్తుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత బతుకమ్మ వేడుకలకు ప్రభుత్వ ప్రోత్సాహం పెరిగింది. ఇప్పుడు ఈ పండుగను అధికారికంగా రాష్ట్ర పండుగగా గుర్తించి.. ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈ ఏడాది బతుకమ్మ ఉత్సవాలు సెప్టెంబర్ 21 నుంచి ప్రారంభమై 30 వరకు జరగనున్నాయి. మొదటి రోజు వరంగల్ జిల్లా రామప్ప ఆలయంలో వేయిస్తంభాల గుడిలో ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. 27వ తేదీన హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ కార్నివాల్ నిర్వహించనున్నారు. 28న పదివేల మంది మహిళలు పాల్గొనే భారీ సంబరాలు జరుగుతాయి.29న పీపుల్స్ ప్లాజాలో పోటీలు నిర్వహించగా, 30న బతుకమ్మ పరేడ్‌తో ఉత్సవాలు ముగియనున్నాయి. ప్రభుత్వం ఈసారి బతుకమ్మ పండుగను ప్రపంచ దృష్టికి తీసుకెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. హుస్సేన్‌సాగర్‌లో 'ఫ్లోటింగ్ బతుకమ్మ' కార్యక్రమం నిర్వహించి పర్యాటకులను ఆకర్షించనుంది. అంతేకాకుండా అంతర్జాతీయ ప్రముఖులను ఆహ్వానించి వారిని వేడుకల్లో భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. విమానయాన సంస్థలతో ఒప్పందాలు కుదుర్చి బతుకమ్మ పండుగ విశేషాలను జాతీయస్థాయిలో ప్రచారం చేయనున్నారు.బతుకమ్మ పండుగ తొమ్మిది రోజుల పాటు సాగుతుంది. ప్రతి రోజు ప్రత్యేకంగా వేరువేరు పువ్వులను ఉపయోగించి బతుకమ్మను అలంకరిస్తారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు అన్ని వర్గాల మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో చేరి, పాటలు పాడుతూ, చిందులు వేస్తూ ఆనందోత్సాహాలతో వేడుకల్లో పాల్గొంటారు. పూలతో తయారు చేసే ఈ ఆరాధన, ప్రకృతితో మమేకమవుతూ భూదేవికి సమర్పించే ఒక సాంస్కృతిక ప్రతీకగా భావించబడుతుంది.పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. బతుకమ్మ ఉత్సవాలు రాష్ట్ర సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తాయని చెప్పారు. ఈ వేడుకల ద్వారా తెలంగాణ ప్రత్యేకతను దేశ విదేశాలకు పరిచయం చేస్తామని తెలిపారు. బతుకమ్మతో పాటుగా పర్యాటక ప్రదేశాలకు కూడా విస్తృత ప్రచారం లభిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా.. అలయ్ బలయ్ కార్యక్రమం కూడా దసరా పర్వదినం సందర్భంగా అక్టోబర్ 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించారు. ఈ ఉత్సవం ప్రేమ, స్నేహం, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్రపతి ప్రశంసించారు. ఇక విద్యార్థులకు బతుకమ్మ పండగ సందర్భంగా తెలంగాణ విద్యార్థులకు వరుస సెలవులను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే.



## హరీష్ కు సోషల్ మీడియా సపోర్ట్

మెదక్ సెప్టెంబర్ 2, కాళేశ్వరం అవినీతిపై సిబిఐ ఏం తేల్చనుందో పక్కనపెడితే, ఆ సిబిఐ ప్రభావం ఆదిలోనే బిఆర్ఎస్ పార్టీలో పెను దుమారం రేపింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అదే పార్టీ కీలక నేత, మాజీ మంత్రి హరీష్‌రావుపై చేసిన విమర్శలతో పార్టీలో ఊహించని పరిణామాలు చకచకా జరిగిపోతున్నాయి.ఇన్నాళ్లు భరించాం, కేసీఆర్ కూతురు కాబట్టే ఊరుకున్నాం. ఇంక చాలు, కవితపై చర్యలు తీసుకోవాల్సిందేనంటూ ఓ వైపు పార్టీ నేతలు అధినేతపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తుంటే.. మరోవైపు కవిత విమర్శల తరువాత బిఆర్ ఎస్ పార్టీ అధికారిక సోషల్ మీడియా మాత్రం కవితను దూరం పెట్టేసింది. హరీష్ రావుపై కవిత తీవ్ర స్దాయిలో విమర్శలు చేసిన కొద్దిసేపటికే బీఆర్ ఎస్ పార్టీ అధికారిక సోషల్ మీడియా చీ లో ఆశక్తికర పోస్ట్ పెట్టింది. హరీష్ రావు నిన్న అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ పై అధికార పార్టీ విమర్శలకు తిప్పికొడుతున్న వీడియో పోస్ట్ చేసింది. ఇది ఆరడుగుల బుల్లెట్ అంటూ హరీష్ రావు ను ఓ రేంజిలో పైకెత్తింది. సింహం సింగిల్ గానే వస్తుందన్నట్లుగా కాళేశ్వరంపై కాలేశ్వరంపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని అసెంబ్లీ సాక్షిగా ఆధారాలతో సహా తిప్పికొడుతున్న మాజీ మంత్రి హరీష్ రావు అంటూ వీడియో పోస్ట్ చేసింది బిఆర్ ఎస్ పార్టీ..బీఆర్ ఎస్ పోస్ట్ చేసిన వీడియోలో హరీష్ రావుకు ఓ రేంజ్ లో ఎలివేట్ చేసారు. కాలేశ్వరం రిపోర్టులో 600 పేజీలకు , ఒక్కొక్క అక్షరానికి నేను సమాధానం చెబుతానంటూ హరీష్ రావు , కాంగ్రెస్ నేతలకు ఇచ్చిన కౌంటర్ డైలాగ్ తో , వరుస పంచ్ లతో ఆ వీడియో ఉంది. ఓవైపు కేసీఆర్ కుమార్తె, ఆపార్టీ ఎమ్మెల్సీ కవిత, హరీష్ రావుపై తీవ్ర ఆరోపణలు చేసిన కొద్ది సేపటికే హరీష్ ను ఆకాశానికెత్తడంతో ఓ క్లారిటీ ఇచ్చేసింది. ఎవరు ఏమన్నా.. బిఆర్ ఎస్ మద్దతు హరీష్ రావుకే ఉంటుందని క్లారిటీ ఇచ్చినట్లయింది. బిఆర్ ఎస్ పోస్ట్ క్రింద అంతే స్దాయిలో హరీష్ రావుకు మద్దతుగా బిఆర్ ఎస్ క్యాడర్ కామెంట్స్ చేయడం ఆశక్తిగా మారింది. తెగేదాకా లాగేశారు.. ఇక మిగిలింది యాక్షన్ తీసుకోవడం మాత్రమే. ఆలస్యం వద్దూ.. ప్రకటన చేయడం ఖాయమంటూ , కవితపై వేటు తప్పదనే వార్తలు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో బిఆర్ ఎస్ సోషల్ మీడియా సైతం హరీష్ కు మద్దతు పలకడంతో కవిత ఇకపై అధికారికంగా కూడా ఒంటరే అనే భావన క్యాడర్ లోకి తీసుకెళ్లింది బిఆర్ ఎస్ . ఇదిలా ఉంటే బిఆర్ ఎస్ అధికారిక వాట్సప్ గ్రూపులలో సైతం కవితను అవమానించేలా బిఆర్ ఎస్ పార్టీ వ్యవహరించిందనే వాదనలు వినిపిస్తున్నాయి.సాధారణంగా బిఆర్ ఎస్ నేతలు మీడియాతో మాట్లడిన కామెంట్స్, వీడియోలు బీఆర్ ఎస్ అధికారికి వాట్సప్ గ్రూపులలో పోస్ట్ చేస్తారు. మీడియాకు ఈ గ్రూపుల ద్వారానే సమాచారం ఇస్తారు. తాజాగా బిఆర్ ఎస్ వాట్సప్ గ్రూపులో హరీష్ రావుపై కవిత వ్యాఖ్యలు పోస్ట్ చేయడం , చేసిన కొద్ది సేపటికే డిలీట్ ఆల్ కొట్టడం చకచకా జరిగిపోయాయి. అంతేకాదు కవిత వ్యాఖ్యలు పోస్ట్ చేసిన కవిత పీర్ ను కూడా బిఆర్ ఎస్ వాట్సప్ గ్రూప్ ల నుంచి రిమూవ్ చేసేశారు. ఇలా బిఆర్ ఎస్ మీడియా రెండుగా చీలిపోయింది. కవిత తనకంటూ వేరే కుంపటి పెట్టుకోక తప్పని పరిస్దితిని తీసుకొచ్చేశారు.సోషల్ మీడియాలో దూరం పెడుతున్నారంటే దాదాపు కవితపై వేటుకు సిద్దంగా ఉన్నామనే సంకేతాలు ఇచ్చేశారనే వార్తలకు బలం చేకూరుతోంది. బీఆర్ ఎస్ నుండి కవితను సాగనంపేందుకు ముహూర్తం ఫిక్స్ చేశారనే ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. సొంత పార్టీలో ఉంటూ,పార్టీ ఎమ్మెల్సీగా కొనసాగుతూ .. పార్టీ నేతలనే విమర్శిస్తే ఊరుకుంటుదా అధిష్టానం అనే వాదనలు ఓవైపు. ఇన్నాళ్లు చూసి చూడనట్లు ఉన్నాం కాదా.. ఇప్పుడూ అలాగే లైట్ తీసుకుందామనే సలహాలు మరోవైపు, ఇవన్నీ ఒకెత్తైతే నేరుగా హరీష్ రావుపై తీవ్ర విమర్శల తరువాత కూడా కవితను వెనకేసుకొస్తే హరీష్ రావు గుడ్ బైయ్ చెప్పేస్తారనే భయం మరోవైపు.. ఇలా ఇవ్వీ లెక్కలు వేశాక, అతి త్వరలో కవితపై చర్యలు తీసుకోక తప్పేలా లేదని బల్లగుద్ది మరీ చెబుతున్నారు సొంత పార్టీ నేతలు.

## కార్యకర్తల కుటుంబానికి అండగా ఉంటా : మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి



భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 02 : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబానికి అండగా ఉంటానని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు, పెద్ద చెరువు రైతు సంఘం డైరెక్టర్ మెరుగు జెన్నయ్య యాదవ్ (65) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. జెన్నయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతదేహంపై మంగళవారం పైళ్ల శేఖర్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం వంకమామిడి గ్రామంలో మాజీ ఎంపీటీసీ సుర్వి సత్యనారాయణ తండ్రి రాములు గౌడ్ (80) మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీత వెంకటేశ్, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాల భూపాల్ రెడ్డి, జిల్లా నాయకుడు కోట మల్లారెడ్డి, సామ రవీందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, మండల, పట్టణ ప్రధాన కార్యదర్శులు చిలువేరు బాలనరసింహ, గునిగంటి మల్లేశ్ గౌడ్, సీత శ్రవణ్, నాయకులు సామల మల్లారెడ్డి, కుడికాల బలరాం, సార బాలయ్య, మునుకుంట్ల బాలచందర్, నోముల మాధవరెడ్డి, ఐతరాజు భిక్షపతి, కుంటోళ్ల మహేశ్, జాంగిర్, చేరాల చిన్న నరసింహ, చింతకింది కిరణ్, పొన్నమోని శ్రీశైలం, జింకల యాదగిరి, నోముల ఉపేందర్ రెడ్డి, తంతరపల్లి వెంకటేశ్, కొంక లక్ష్మీనారాయణ, భారత గిరి, సిద్దుల ప్రభాకర్, కర్నాటి అంజమ్మ పాల్గొన్నారు.

## కన్నబిడ్డ కంటే పార్టీ శ్రేయస్సే ముఖ్యమని కేసీఆర్ చాటారు : ఎమ్మెల్యే పల్లా



హైదరాబాద్ : కన్నబిడ్డ కంటే పార్టీ శ్రేయస్సే ముఖ్యమని కేసీఆర్ తెలియజేశారు అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. కవిత సస్పెన్షన్‌పై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పందించారు. పార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకే కవితపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 60 లక్షల పార్టీ కార్యకర్తల మనోభావాల మేరకు కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా చర్యలు తప్పవు. కాంగ్రెస్ ఉచ్చులో పడి ఆ పార్టీ చెప్పినట్లు కవిత నడుచుకుంటున్నారు. ప్రాంతీయ పార్టీల్లో కుటుంబ కలహాలు సృష్టించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారింది అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఎమ్మెల్సీ కవిత ఇటీవలి కాలంలో ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు, కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు బీఆర్ఎస్ పార్టీకి నష్టం కలిగించే రీతిలో ఉన్నందున పార్టీ అధిష్టానం ఈ విషయాన్నీ తీవ్రంగా పరిగణిస్తున్నది. పార్టీ అధ్యక్షులు కేసీఆర్ కవితను తక్షణం పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారని బీఆర్ఎస్ పార్టీ పేర్కొంది.

## బీఆర్ఎస్ నిరసన

వికారాబాద్,కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో వికారాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ స్థాయిలో నిరసన తెలిపారు. మాజీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.×అనంతరం తమ ఇంటి నుంచి అమరరవీరుల స్తూపం వరకు తబల వాయిధ్యలతో గణపతి పాటలతో ర్యాలీగా వెళ్ళారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మాట్లాడుతూ "పీసీ ఘోష్ కమిషన్ అసలు కమిషన్ కాదు, అది కాంగ్రెస్ పార్టీ వేసుకున్న పీసీసీ ఘోష్ కమిషన్

# జనవరి నుంచి క్వాంటమ్ సేవలు

అమరావతి, సెప్టెంబర్ 2,ఏపీలో తొలి క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానుంది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌లో ఐబీఎం క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చదరపు అడుగుకు రూ.30 అద్దె చొప్పున ఐబీఎంకు కేటాయిస్తూ ప్రభుత్వ ఐటీ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం.. ప్రభుత్వ సంస్థగా దీనిని ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దే దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయనున్న సంగతి తెలిసిందే. అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటు కోసం సీఆర్డీఏ ఇప్పటికే 50 ఎకరాల స్థలం కూడా కేటాయించింది. ప్రభుత్వ సంస్థగా అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ (ఔఖఅఅ) ఏర్పాటు కానుంది. తాజాగా ఏక్యూసీసీలో ఐబీఎం క్వాంటం కంప్యూటర్ ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చదరపు అడుగుకు రూ.30లు అద్దె చెల్లించేలా ఏపీ ప్రభుత్వం రాయితీపై ఐబీఎం సంస్థకు భూములు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. దీనికి బదులుగా ఐబీఎం సంస్థ 4 ఏళ్ల పాటు ఏడాదికి 365 గంటల ఫ్రీ కంప్యూటింగ్ టైమ్‌ను ప్రభుత్వానికి కేటాయించనుంది.ఈ కంప్యూటింగ్ టైమ్‌ను ప్రభుత్వ సంస్థలు, విద్యాపరమైన అంశాలకు కేటాయిస్తారు. ఈ మేరకు ఏపీ ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్.. తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు అమరావతి క్వాంటం వ్యాలీ లో 2000 చదరపు అడుగుల్లో.. 133 క్యూబిట్, 5కె గేట్స్ క్వాంటం కంప్యూటర్‌ను ఐబీఎం సంస్థ ఏర్పాటు చేయనున్న సంగతి తెలిసిందే. మరోవైపు అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌లో వివిధ శాఖల అధికారులను బోర్డు డైరెక్టర్లుగా ప్రభుత్వం నియమించింది. అమరావతిని టెక్నాలజీ హబ్‌గా మార్చా?లనే ఉద్దేశంతో అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయనున్నారు.రూ.4,000 కోట్లతో అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. 2026 జనవరి నాటికి క్వాంటం వ్యాలీ కార్యకలాపాలు ప్రారంభించేలా ప్రణాళికలు రచిస్తున్నారు. దీని ద్వారా 15 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. జాతీయ క్వాంటం మిషన్‌లో భాగంగా అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు ప్రభుత్వానికి సహకారం అందించనున్నాయి. ఎల్‌అండ్‌టీ సంస్థ మౌలిక సదుపాయాలు కల్పిస్తే.. హైబ్రిడ్ కంప్యూటింగ్ సొల్యూషన్లు, క్యాంటం కంప్యూటింగ్ సేవలను టీసీఎస్ అందిస్తుంది. ఐబీఎం సంస్థ దేశంలోనే అత్యంత వేగవంతమైన క్వాంటం కంప్యూటర్ ఏర్పాటుచేస్తుంది.

# కైలాసగిరిలో పొడవైన గాజు వంతెన...

విశాఖపట్టణం,సెప్టెంబర్ 2, ఏపీలో పర్యాటక రంగం అభివృద్ధికి అనేక ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ క్రమంలోనే దేశంలోనే అతి పొడవైన గాజు వంతెన ఏపీలో ఏర్పాటువుతోంది. విశాఖపట్నం సిగలో మరో మణిహారంలా కైలాసగిరి వద్ద గ్లాస్ స్కైవాక్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసుకుంది. త్వరలోనే ఈ గాజు వంతెన పర్యాటకులకు అందుబాటులోకి రానుంది. 50 మీటర్ల పొడవుతో ఉండే ఈ వంతెనపై తిరుగుతూ ప్రకృతి ప్రేమికులు సాగర తీరం అందాలను వీక్షించవచ్చు.పర్యాటక రంగం అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. హోమ్‌స్టేలు, ఎయిర్‌డ్రోమ్స్ వంటి వినూత్న ఆలోచనలు చేస్తోంది. మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వరంగా ఉన్న సముద్ర తీరాన్ని పర్యాటక రంగం అభివృద్ధికి ఉపయోగించుకునేందుకు ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. తీర ప్రాంతాలను టూరిస్ట్ స్పాట్‌లుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉంది. ఈ నేపథ్యంలోనే సముద్ర తీర ప్రాంతం వెంబడి పర్యాటక పరంగా



అనే అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బెస్ట్ టూరిస్ట్ స్పాట్ ఏంటంటే ఠక్కున చెప్పేమాట .. విశాఖపట్నం. అలల జోరు.. సాగర హోరుతో సాగర తీరం విశాఖ పర్యాటకులను కట్టిపడేస్తూ ఉంటుంది. అలాంటి విశాఖపట్నం సిగలో త్వరలోనే మరో మణిహారం చేరనుందిభారతదేశంలోనే అత్యంత పొడవైన గాజు వంతెన విశాఖపట్నంలో నిర్మిస్తున్నారు. దీని నిర్మాణం కూడా పూర్తైంది. రెండు నుంచి మూడు వారాల్లో ఈ గ్లాస్ బ్రిడ్జిని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. విశాఖలో పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో భాగంగా.. దేశంలోనే అతి పొడవైన కాంటిలివర్ గ్లాస్ స్కైవాక్ వంతెనను కైలాసగిరి వద్ద నిర్మిస్తున్నారు. కైలాసగిరి వద్ద టైటానిక్ వ్యూపాయింట్‌కు సమీపంలో 50 మీటర్ల పొడవుతో ఈ గ్లాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేస్తున్నారు. ప్రకృతి సౌందర్యం, సముద్రపు అందాలను ఆకాశం నుంచి వీక్షించేలా.. ప్రకృతి ప్రేమికులకు, సాహస ప్రియులకు, ఈ గ్లాస్ స్కైవాక్ బ్రిడ్జి మరిచిపోలేని, మరపురాని అనుభవాన్ని అందించనుంది.మరోవైపు కైలాసగిరి గాజు వంతెన నిర్మాణాన్ని 2024లో ప్రారంభించారు. ఇందుకోసం సుమారుగా ఆరు కోట్లు ఖర్చు చేస్తున్నట్లు అంచనా. ఈ వంతెన అందుబాటులోకి వస్తే మన దేశంలోని అతి పొడవైన కాంటిలివర్ గ్లాస్ స్కైవాక్ వంతెనగా రికార్డులకు ఎక్కుతుంది.ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ గాజు వంతెనను నిర్మిస్తున్నారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ)తో పాటు కొన్ని ప్రైవేట్ సంస్థలు ఇందులో పాలుపంచుకున్నాయి. ఈ గాజు వంతెనపై ఒకేసారి 40 మంది వరకూ నిల్చుని ప్రకృతి అందాలు ఆస్వాదించేలా నిర్మిస్తున్నారు.మనదేశంలో అత్యంత పొడవైన గాజు వంతెనగా ప్రస్తుతం కేరళలోని వాగమోన్ గ్లాస్ బ్రిడ్జి ఉంది. దీని పొడవు 40 మీటర్లు. అయితే కైలాసగిరి స్కైవాక్ వంతెన అందుబాటులోకి వస్తే.. విశాఖపట్నం గాజు వంతెన ఆ రికార్డులను బద్ధలు కొట్టనుంది. దేశంలోనే పొడవైన గాజు వంతెనగా నిలుస్తుంది.

# ఆడుదాం ఆంధ్రలో 40 కోట్లు లూటీ

తిరుపతి, సెప్టెంబర్ 2,మాజీ మంత్రి రోజా( అరెస్టు తప్పదా? వారం రోజుల్లో ఆమె అరెస్టు ఉంటుందా? కూటమి నేతలు చెబుతున్న మాటల్లో నిజం ఎంత? ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ఇదే చర్చ నడుస్తోంది. శాప్ చైర్మన్ గా ఉన్న రవి నాయుడు అనే నేత రోజా అరెస్టు ఉంటుందని ప్రకటన చేశారు. వారం రోజుల్లో ఆమె అరెస్టు తప్పదని ఆయన చేసిన ప్రకటన ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. వైసిపి హయాంలో జరిగిన 'ఆడుదాం ఆంధ్రా' పోటీల్లో భారీ అవినీతి జరిగిందన్నది కూటమి ప్రభుత్వం అనుమానం. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై విజిలెన్స్ విచారణ కూడా చేపట్టింది. అన్ని జిల్లాల నుంచి వివరాలు సేకరించింది. అయితే పోటీల నిర్వహణ, క్రీడాకారుల నజరానాలు, క్రీడా పరికరాలకు కొనుగోళ్లలో భారీ అవకతవకలు జరిగినట్లు విచారణలో తేలింది. దీనికి బాధ్యులను చేస్తూ మాజీమంత్రి ఆర్కే రోజాతో పాటు అప్పటి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగించే ప్రయత్నంలో ఉంది కూటమి. తప్పకుండా మాజీ మంత్రి రోజా అరెస్టు ఉంటుందని ఎప్పటినుంచో ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు ఆ సమయం ఆసన్నం అయినట్లు తెలుస్తోంది. దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విచారణ పూర్తయింది. 40 కోట్ల రూపాయల అవినీతి జరిగినట్లు విజిలెన్స్ ఎంక్వైరీలో తేలినట్లు సమాచారం.అయితే మహిళా నేతగా ఉన్న రోజా అరెస్టు విషయంలో కూటమి ప్రభుత్వం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే వైసిపి హయాంలో చాలా దూకుడుగా ఉండేవారు రోజా. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడేవారు. ఈ క్రమంలోనే ఆమెపై ఒక రకమైన నెగిటివ్ ప్రభావం కూడా ఉంది. ఆమె తీరుపై ప్రజల్లోనే భిన్నాభిప్రాయం ఉంది. అందుకే ఆమె అరెస్టు విషయంలో ఎటువంటి ఇబ్బందులు వచ్చే అవకాశం లేదని.. ప్రజల్లో నెగిటివ్ అనేది ఉండదని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అయితే రోజా అరెస్టు జరిగితే వైసిపి దానిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధపడుతోంది. కానీ కూటమి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రాలో ప్రతి జిల్లాలో జరిగిన అవినీతిని పక్కా ఆధారాలతో బయట పెట్టేందుకు అన్ని రకాల సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.వాస్తవానికి తన విషయంలో అరెస్టు ఉండదని రోజా భావించారు. మహిళా నేతగా తనవరకు వస్తే కూటమి ప్రభుత్వంపై నెగిటివ్ వస్తుందని అంచనా వేసుకున్నారు. కానీ ఆడుదాం ఆంధ్రాలో రోజా అవినీతిని కళ్లకు కట్టినట్లు ఆధారాలతో చూపించి.. అరెస్టు చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అయితే విజిలెన్స్ నివేదికను ఆధారంగా చేసుకుని ఏసీబీ కేసు నమోదు చేసి అరెస్టు చేస్తారా? లేకుంటే సిఐడి ద్వారా అరెస్టుకు చర్యలు తీసుకుంటారా? అనేది తెలియాల్సి ఉంది. రోజాను అరెస్టు చేయాలంటే ముందుగా గవర్నర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆమె మాజీ మంత్రి కాబట్టి. అయితే రోజా విషయంలో కొద్ది రోజులపాటు ప్రభుత్వం ఆలోచన చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# రేవంత్ మాట వరుసకు అన్నారా? సీరియస్ అన్నారా ?

## సోషల్ మీడియాలో వైసీపీ లోల్లి

విజయవాడ, సెప్టెంబర్ 2, హైదరాబాద్ తెలంగాణకు అడ్వాంటేజ్ అయితే.. ఏపీకి అమరావతి లయబులిటీ అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. ఏపీలో ఉన్న పోటీ వాతావరణంపై మాట్లాడుతూ ఆయనీ వ్యాఖ్యలు చేశారు. అలాగే చంద్రబాబు చాలా సీనియర్ అన్న అర్థంలో వ్యాఖ్యలు చేశారు. అలాగే నారా లోకేష్ చాలా జూనియర్ అని... తన వయసు కూడా తనకు అడ్వాంటేజ్ అని రేవంత్ రెడ్డి ఇంటర్వ్యూలో చెప్పారు. రేవంత్ ఇంటర్వ్యూలోని మిగతా అంశాలు పెద్దగా వైరల్ కాలేదు కానీ ఈ క్లిప్ మాత్రం వైరల్ అయింది.అమరావతి విషయంలో ఎప్పటికప్పుడు పూర్తి స్థాయిలో వ్యతిరేకంగా ఉండే వైసీపీ ఈ అవకాశాన్ని అంది పుచ్చుకుంది. అమరావతి ఏపీకి లయబలిటీ అని రేవంత్ కూడా చెప్పారని ప్రచారం చేస్తున్నారు. అదే సమయంలో చంద్రబాబు వయసు అయిపోయిందని.. లోకేష్ మరీ జూనియర్ అని కూడా చెబుతున్నారు. వైఎస్ఆర్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలందరూ ఈ వీడియోను వైరల్ చేస్తున్నారు. అమరావతి విషయంలో రేవంత రెడ్డి వ్యాఖ్యలు చేయడాన్ని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు. కారణం ఏదైనా రేవంత్ రెడ్డి అంటే తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కాస్త అభిమానం చూపిస్తారు. సోషల్ మీడియాలో తెలంగాణలో ఏ లీడర్ కు మద్దతు పలకాల్సిన ప్రస్తావన వస్తే ఖచ్చితంగా రేవంత్ కే మద్దతు పలికేవారు. అలాంటిది ఇప్పుడు ఆయన అమరావతిపై అవసరం లేకపోయినా వ్యాఖ్యలు చేయడం, చంద్రబాబు , లోకేష్ పై నా వ్యాఖ్యలు చేయడం జీర్ణించుకోలేకపోతున్నారు. అమరావతికి వాతావరణం అనుకూలం కాదని రేవంంతత్ అన్నారు. అమరావతికి తుపాన్లు వస్తాయి హైదరాబాద్ కు రావని రేవంత్ ఉద్దేశం కావొచ్చన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే తాపునులు వచ్చే ప్రాంతాలలో నగరాలు అభివృద్ధి చెందవా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

# పవన్ జాతీయ ఆలోచనలు..

## సోషల్ మీడియాలో సెటైర్లు

కాకినాడ, సెప్టెంబర్ 2, జనసేన పార్టీ జాతీయ పార్టీ అవుతుందని ప్రకటించి పవన్ కల్యాణ్ మరో బీఆర్ఎస్ గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లే ఉంది. కేసీఆర్ కూడా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండు సార్లు అధికారంలోకి వచ్చి తర్వాత అత్యాశతో జాతీయ పార్టీగా మార్చారు. తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్రసమితిగా పేరు మార్చి 2023 ఎన్నికల్లో చేతులు కాల్చుకున్నారు. జనం ఓడించారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ కూడా ముందు ఆంధ్రప్రదేశ్ లో పార్టీని విస్తరణపై దృష్టి పెట్టాల్సిన సమయంలో పవన్ కల్యాణ్ కూడా తాను జాతీయ పార్టీ అవుతుందని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో సెటైర్లు వినిపిస్తున్నాయి. అసలు కొన్ని జిల్లాల్లో పార్టీకే దిక్కులేని పరిస్థితుల్లో జాతీయ పార్టీగా ఎలా మారుతుందని ప్రశ్నిస్తున్నారు. పవన్ కల్యాణ్ జనంలోకి పెద్దగా వెళ్లలేరు. ఆయనకు అభిమానుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆయన మిగిలిన రాజకీయ పార్టీల అగ్రనేతల తరహాల్లో రోడ్ షోలు, ప్రజల్లోకి వెళ్లడం వంటివి చేయలేరు. ఆయనను తాకాలని ఫ్యాన్స్ తపించిపోతుంటారు. గతంలోనూ అనేక సమయంలో పవన్ కల్యాణ్ జనంలోకి వచ్చినప్పుడు ప్రమాదాలు జరిగాయి. ఒక సమయంలో ఆయనను కూడా అభిమాని నెట్టివేయడంతో కారుపై నిల్చున్న పవన్ కల్యాణ్ పడిపోయారు. ఇలాంటి ఘటనల తర్వాత ఆయన ఇంటర్నల్ మీటింగ్ లు, బహిరంగ సభలకు మాత్రమే పరిమితమయ్యారు. దీంతో పాటు ఆయన ఎక్కువగా పర్యటనలు చేయడానికి కూడా సుముఖత చూపరు. అవసరమైన సమయంలో తప్పించి జనంలోకి రారన్న విమర్శలు పవన్ కల్యాణ్ పై ఉన్నాయి. 2014లో జనసేన పార్టీ పెట్టిన తర్వాత 2019 ఎన్నికల్లో తొలిసారి కమ్యునిస్టులు, బీఎస్పీలతో కలసి పోటీ చేసి సింగిల్ స్థానం కూడా సాధించలేకపోయారు. అయితే 2024 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఏర్పడటంతో 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు నియోజకవర్గాల్లో గెలిచి హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ సాధించారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పోలిస్తే ఆయన ప్రజలలోకి వెళ్లడం తక్కువ సార్లే అని చెప్పాలి. గెలిచిన ఏడాది తర్వాత విశాఖలో పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకూ గెలిచిన నియోజకవర్గాల్లోనే అయన పర్యటించలేదు.ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జనసేన కు బూత్ లెవెల్ కమిటీలు లేవు. ఈ పరిస్థితుల్లో పవన్ కల్యాణ్ జాతీయ పార్టీ అని చెప్పడంపై పలువురు సోషల్ మీడియా వేదికగా ఎద్దేవా చేస్తున్నారు.మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడులో తమను కోరుకుంటున్నారని, తనను అభిమానించే వారేనని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. తనకు సిద్ధాంతాలను ఉన్నాయని వాటి ప్రకారమే తాను జనసేన పార్టీని జాతీయ పార్టీగా మలుస్తానని ఆత్మవిశ్వాసంతో పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. అయితే అక్కడ పార్టీలను కాదని మీకు అండగా నిలిచే అవకాశం లేదన్నది కూడా వాస్తవం. అయితే ముందు పొరుగున ఉన్న తెలంగాణలో కనీసం పోటీ చేయలేని పరిస్థితుల్లో ఉండి, అభిమానులు, కులానికి సంబంధించిన వాళ్లు అత్యధికంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ లోనే సొంతంగా ఎదగలేని, పోటీ చేసినా గెలవలేని పరిస్థితుల్లో ఉన్న పవన్ కల్యాణ్ జాతీయ పార్టీ అని చెప్పి చేతులు కాల్చుకోవడమేనని అంటున్నారు. ముందు ఆంధ్రప్రదేశ్ లో జనసేను బలోపేతం చేయాలని పార్టీ నేతలే ఆఫ్ ది రికార్డుగా చెబుతున్నారు. అత్యాశకు, అనవసర రాద్ధాంతాలకు పోయి పార్టీని జాతీయ పార్టీగా మలచి అసలుకే ఎసరు తెచ్చుకోవద్దని హితవు కూడా పలుకుతున్నారు.దసరా తర్వాత త్రిశూల్ విధానంవిశాఖ వేదికగా నిర్వహించిన సేనతో సేనాని సభలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ బలోపేతానికి దసరా తర్వాత త్రిశూల వ్యూహం అనుసరిస్తామని తేల్చి చెప్పారు. పార్టీ పెట్టినప్పటి నుంచి ఎన్నో సమస్యలను బయటికి తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. 10 ఏళ్లపాటు తనను తాను పరీక్షించుకుని పార్టీ పెట్టినట్లు తెలిపారు. పార్టీ పెట్టినప్పుడు తనతో ఉన్నవారు.. కొన్ని సమస్యలు రాగానే వెళ్లిపోయారని.. ఒక ఐడియాలజీ ఉన్నవారు మాత్రమే ఇప్పటికీ తన వెంట ఉన్నారని తెలిపారు. పార్టీని జాతీయ పార్టీగా మార్చేందుకు.. జనసేన నేతలకు మరింత స్థైర్యం, స్థిరత్వం ఉండాలని పేర్కొన్నారు. పార్టీకి తగిలిన దెబ్బలు.. మరింత రాటుదేల్చాయని.. ఎన్ని కష్టాలు వచ్చినా నిలబడ్డాం కాబట్టే ఇప్పుడు ప్రజలకు మేలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీరమహిళల సేవలను పవన్ గుర్తు చేసుకున్నారు. పార్టీని ఏ సిద్ధాంతాలు, నిబద్ధతతో పెట్టామో ఇప్పటికే అలాగే ఉన్నట్లు చెప్పుకొచ్చారు.జనసేన పార్టీని మరింత ఉన్నతస్థితికి తీసుకువెళ్లేందుకు దసరా పండగ తర్వాత త్రిశూల కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. జనసేన కార్యకర్తల గుర్తింపు.. నాయకత్వం, భద్రత కోసం ఈ త్రిశూల కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీలోని క్రియాశీల సభ్యుడినిపార్టీ సెంట్రల్ కమిటీ నేతలతో అనుసంధానమయ్యేలా కమిటీ వేస్తామని చెప్పారు. రాజకీయాలంటే.. బిజినెస్, డబ్బు సంపాదిన కాదని పవన్ కల్యాణ్ అన్నారు. జనసేన పార్టీ కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం, స్థిరత్వం రావాలని పవన్ కల్యాణ్ సూచించారు. అలా ఉన్నప్పుడే ప్రాంతీయ పార్టీగా ఉన్న జనసేన.. జాతీయ పార్టీగా ఎదుగుతుందని వెల్లడించారు. 2019లో తాను పోటీ చేసిన రెండు చోట్లా ఓడిపోయిన తర్వాత.. తాను రాజకీయాల్లో వెనక్కి వెళ్లిపోతానని అందరూ భావించారని పేర్కొన్నారు.ఆ ఒక్క ఓటమితో దశాబ్దకాలం సినిమాలపై దృష్టి సారించలేకపోయానని.. అయినా తట్టుకొని నిలబడ్డామని.. ఆ కారణంగానే ప్రస్తుతం రికార్డు స్థాయి విజయం సాధించి.. అధికారంలోకి రాగలిగామని పవన్ కల్యాణ్ తెలిపారు. అధికారం చేతిలో ఉన్నప్పటికీ.. కాంట్రాక్టులు తీసుకోలేదన్నారు. జనసేన పార్టీ లక్ష్యం రాష్ట్రం, దేశం అభివృద్ధే అని తేల్చి చెప్పారు. జనసేన నేతలందరికీ ఐడియాలజీతో పాటు వ్యూహాలు కూడా ఉండాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# 7న గ్రహణం...ఆలయాల మూసివేత

తిరుమల, సెప్టెంబర్ 2, ఈ నెలలో రెండవ చివరి చంద్ర గ్రహణం ఏర్పడనుంది. ఈ గ్రహణం భారత దేశంలో కనిపించనున్న సంగతి తెలిసిందే. దీంతో గ్రహణ సూతక కాలం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానం భక్తుల కోసం ఒక కీలక ప్రకటన చేసింది. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సెప్టెంబర్ 7, 2025న చంద్రగ్రహణం కారణంగా మూసివేయబడుతుందని టీటీడీ ప్రకటించింది. ఆలయ పరిపాలన ప్రకారం సెప్టెంబర్ 7న మధ్యాహ్నం 3:30 గంటలకు శ్రీవారి ఆలయం మూసివేయనున్నారు. చంద్ర గ్రహణం వీడి ఆలయాన్ని సంప్రదాయం ప్రకారం శుద్ధి కర్మలను చేసిన తర్వాత సెప్టెంబర్ 8, 2025న తెల్లవారుజామున 3:00 గంటలకు తిరిగి తెరవనున్నట్లు



ప్రకటించారు.హిందూ సంప్రదాయాల ప్రకారం సూర్య, చంద్ర గ్రహణాల సమయంలో దేశవ్యాప్తంగా ఉన్న దేవాలయాలు మూసివేస్తారు. ఎందుకంటే గ్రహణ సమయం పూజలు నిర్వహించడానికి అశుభకరమైనదిగా భావిస్తారు. భారతదేశంలోని పవిత్ర ఆధ్యాత్మిక క్షేత్రంలో ఒకటైన తిరుమల తిరుపతి ఆలయం ఈ ఆచారాన్ని ఖచ్చితంగా పాటిస్తుంది. ఈ కాలంలో ఆలయంలో శ్రీవారి దర్శనం, అన్ని రకాల సేవలు నిలిపివేయబడతాయి. చంద్రగ్రహణం ముగిసిన తర్వాత? ఆలయ పూజారులు పుణ్యాహవచనం (శుభ్రపరిచే ఆచారాలు), ఇతర వేద ఆచారాలను నిర్వహించి భక్తుల కోసం ఆలయాన్ని తిరిగి తెరుస్తారు. గ్రహణం తర్వాత శుద్ధి కర్మలు పూర్తయిన వెంటనే ఆలయంలో అన్ని సాధారణ సేవలు, దర్శనాలు తిరిగి ప్రారంభమవుతాయి.తిరుమల ఆలయం ముసి వేయనున్న నేపథ్యంలో ఈ సమయంలో శ్రీవారి దర్శనం కోసం ఏర్పాటు చేసుకున్న వేలాది మంది భక్తులపై ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. సవరించిన సమయాలకు అనుగుణంగా యాత్రికులు తమ దర్శనాలను తిరిగి షెడ్యూల్ చేసుకోవాలని, అందుకోసం అధికారిక వెబ్ ని సందర్శించి ఆలయ దర్శన సమయం గురించి సమాచారం తెలుసుకోవాలని అధికారులు కోరారు. సెప్టెంబర్ 8 తెల్లవారుజామున భారీ సంఖ్యలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్న టీటీడీ సిబ్బంది అందుకు అనుగుణంగా ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు సిద్ధం అవుతుందని ఆలయ అధికారులు చెప్పారు,తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ఆలయం ప్రపంచంలోనే అత్యధికంగా భక్తులు సందర్శించే పుణ్యక్షేత్రాలలో ఒకటిగా ఉంది. ప్రతి నెలా లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. గ్రహణ సమయంలో తాత్కాలికంగా ఆలయం మూసివేయడం వలన అసౌకర్యం కలిగినప్పటికీ ఆలయ సంప్రదాయాలు, పవిత్రతను కాపాడటానికి ఈ చర్యలు చాలా కీలకమని అధికారులు చెబుతున్నారు. సెప్టెంబర్ 7 వ తేదీ 2025 చంద్రగ్రహణం భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో కనిపిస్తుంది. దేశవ్యాప్తంగా అనేక ఇతర దేవాలయాలు కూడా గ్రహణ సమయంలో ఆలయాలను మూసివేస్తారు.

# సొంతంగా నేతలను ఎన్నుకొనే ప్రయత్నం

విజయవాడ, సెప్టెంబర్ 2, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మరోసారి అధికారంలోకి వస్తామని భావిస్తున్నారు. ఆయనకు జిల్లాల పర్యటనలో వచ్చి స్పందన చూసి మరోసారి అధికారం తనదేనని భావిస్తున్నారు. ఈసారి సర్వేలను నమ్ముకున్నట్లు కనిపించడం లేదు. సర్వేలు, ఐప్యాక్ వంటి సంస్థల వంటి వాటిని నమ్ముకుని నట్టేట మునిగామని జగన్ బలంగా విశ్వసిస్తున్నారు. అందుకే సొంతంగా తానే జగన్ నియోజకవర్గాల నేతలను ఎంపిక చేసే విషయంపై దృష్టిపెట్టారు. అయితే జగన్ పై కోటరీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఇప్పటికీ పార్టీలో విమర్శలు వినిపిస్తున్నాయి. జగన్ ఓటమి తర్వాత కూడా కోటరీ నుంచి బయట పడలేకపోతున్నారని కొందరు నేతలు బాహాటంగానే చెబుతున్నారు. కోటరీని వదిలి వాస్తవ విషయాలను తెలుసుకుని అందుకు అనుగుణంగా నియోజకవర్గాలకు నాయకత్వాలను ఎంపిక చేయాలని కోరుతున్నారు.ముందుగా కార్యకర్తల అభిప్రాయాన్ని తెలుసుకోవాలని కూడా అనేక మంది నేతలు కోరుతున్నారు. నేతలు చాలా మంది ఓటమి తర్వాత ఏడాది నుంచి నియోజకవర్గాల్లో ఉండటం లేదు. కార్యకర్తలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. దీంతో గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయిన నాయకులపై కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు. ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ తమను పట్టించుకోని నేతలు, ఓటమి తర్వాత కూడా తమకు అందుబాటులో ఉండటం లేదని క్యాడర్ అనేక నియోజకవర్గాల్లో అసంతృప్తిగా ఉంది. అయితే కూటమి పార్టీలను వ్యతిరేకిస్తూ, జగన్ పై అభిమానంతోనే ఇంకా జెండా పట్టుకుని ఉన్నామని, స్థానిక నేతలను చూసి కాదని సోషల్ మీడియాలో వారు పోస్టులు పెడుతున్నారు. వైఎస్ జగన్ కూడా నేతలను దగ్గరకు తీసుకుంటే కార్యకర్తలు దూరమయ్యే అవకాశాలున్నాయి. ఎందుకంటే స్థానిక నాయకత్వంపై క్యాడర్ కు నమ్మకం లేకపోగా బాగా అసంతృప్తి ఉంది. కోటరీ మాత్రం గత ఎన్నికల్లో పోటీ చేసిన వారినే ఇన్ ఛార్జులుగా నియమించాలని, వారికే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వాలని వత్తిడి తెస్తే మళ్లీ మోసం వస్తుందన్న కామెంట్స్ రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం జగన్ చేయాల్సింది కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటుచేయడం. వారిని సముదాయించడం. తిరిగి వారిని ఉత్తేజపర్చడం. ఇప్పటికే వైసీపీ సోషల్ మీడియా ఒకింత యాక్టివ్ అయింది. అయితే క్యాడర్ మరింతగా పార్టీ కోసం పనిచేయాలంటే జగన్ నేతలతో కాదు.. క్యాడర్ తో మమేకం కావాలని అంటున్నారు. మరి జగన్ ఈ దిశగా ఆలోచన చేస్తారా? లేదా? అన్నది చూడాలి.

# దోమలకు ఇష్టమైన బ్లడ్ గ్రూప్ ఏది? ఎవరిని ఎక్కువగా కుడతాయి?



దోమలు ఎవరిని ఎక్కువగా కుడతాయి అనే ప్రశ్న చాలా మందికి ఉంటుంది. ప్రత్యేకించి వేసవి, వర్షా కాలంలో ఈ ప్రశ్న మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. అసలు దోమలు ఎందుకు కుడతాయి? ఏ రకమైన వ్యక్తులను ఎక్కువగా ఆకర్షిస్తాయి? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకడం ఆసక్తికరంగా ఉంటుంది. దోమల కాటు వల్ల మలేరియా, డెంగ్యూ వంటి ప్రమాదకరమైన వ్యాధులు వ్యాపిస్తాయి. కాబట్టి దోమల నుండి రక్షించుకోవడం చాలా ముఖ్యం దోమలు ఎందుకు కుడతాయి? దోమలు మన రక్తాన్ని తాగి జీవిస్తాయి. అవి మన శరీరంలోని కార్బన్ డయాక్సైడ్ వాసనను గ్రహించి మన వైపు ఆకర్షితమవుతాయి. అంతేకాకుండా మన శరీర ఉష్ణోగ్రత, చర్మం మీద ఉండే లాక్టిక్ యాసిడ్, మరియు విడుదలయ్యే కొన్ని రకాల రసాయన పదార్థాల వల్ల కూడా దోమలు ఆకర్షితమవుతాయి. ంశ్రీబనీ సూర్య సేనలో ఆ ఇద్దరూ ఔట్ – వారికి ఛాన్స్, తుది జట్టు..!! దోమలకు ఇష్టమైన బ్లడ్ గ్రూప్ ఏది?—ాలా మందికి దోమలు ఒక రకమైన బ్లడ్ గ్రూప్ వారిని ఎక్కువగా కుడతాయి అని భావిస్తారు. అయితే ఈ విషయంపై పరిశోధకుల అభిప్రాయాలు విభిన్నంగా ఉన్నాయి. కొంతమంది పరిశోధకులు ా బ్లడ్ గ్రూప్ ఉన్న వ్యక్తులను దోమలు ఎక్కువగా కుడతాయని చెప్పగా, మరికొందరు ః బ్లడ్ గ్రూప్ ఉన్న వ్యక్తులను దోమలు తక్కువగా కుడతాయని చెబుతున్నారు. "చికెన్‌లో ఈ నాలుగు పార్ట్స్ అస్సలు తినొద్దు.. తిన్నారో అంతే సంగతి!" దోమలు ఎవరిని ఎక్కువగా కుడతాయి? శారీరకంగా చురుకుగా ఉండే వ్యక్తులు ఎక్కువ కార్బన్ డయాక్సైడ్‌ను వెలువరిస్తారు కాబట్టి వారిని దోమలు ఎక్కువగా ఆకర్షిస్తాయి. గర్భిణీ స్త్రీల శరీర ఉష్ణోగ్రత కొంచెం ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా వారు ఎక్కువగా కార్బన్ డయాక్సైడ్‌ను వెలువరిస్తారు కాబట్టి వారిని దోమలు ఎక్కువగా ఆకర్షిస్తాయి. వ్యాయామం చేసిన తర్వాత శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది మరియు ఎక్కువ కార్బన్ డయాక్సైడ్ వెలువడుతుంది. అందుకే వ్యాయామం చేసిన వ్యక్తులను దోమలు ఎక్కువగా కుడతాయి. మన లాలాజలంలో ఉండే కొన్ని రకాల పదార్థాలు దోమలను ఆకర్షిస్తాయి. చర్మం మీద ఉండే కొన్ని రకాల బ్యాక్టీరియా దోమలను ఆకర్షిస్తాయి. పోలవరంపై కేంద్రం సంచలన ప్రకటన। 5 దోమల కాటు నుండి ఎలా రక్షించుకోవాలి? జనీబీ "టాబ్లెట్లు వేసుకుంటున్నారా? ఈ ఒక్క పనిమాత్రం చేయొద్దు" దోమల నివారణ మందులు చర్మం మీద లేదా దుస్తులపై పూసుకోవడం వల్ల దోమల నుండి రక్షణ పొందవచ్చు. దోమల నిరోధక ద్రవ్యాలు ఉన్న దుస్తులు ధరించడం మంచిది. ఇంటిలో జాలీ ప్రదేశాలను వాడటం ద్వారా దోమలను నివారించవచ్చు. వేసవి, వర్షా కాలంలో వీలైనంత వరకు ఇంట్లోనే ఉండండి. సాయంత్రం వేళల్లో బయటకు వెళ్లేటప్పుడు దీర్ఘచీర దుస్తులు ధరించండి. శరీరంలో ఎక్కడైనా దోమ కుట్టినట్లు అనిపిస్తే వెంటనే దానిని గోరుతో గీయకూడదు. దోమల కాటు వల్ల మలేరియా, డెంగ్యూ వంటి ప్రమాదకరమైన వ్యాధులు వ్యాపిస్తాయి. కాబట్టి దోమల నుండి రక్షించుకోవడం చాలా ముఖ్యం. గమనిక: ఈ సమాచారం కేవలం సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే వైద్యుడిని సంప్రదించండి.

# చికెన్‌లో ఈ నాలుగు పార్ట్స్ అస్సలు తినొద్దు.. తిన్నారో అంతే సంగతి!

చికెన్ అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న ప్రోటీన్-రిచ్ ఫుడ్. ఇది కండరాల నిర్మాణం , మరమ్మత్తుకు, బరువు నిర్వహణకు సహాయపడుతుంది. ఎముకలను బలపరుస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కొలెస్ట్రాల్ కలిగి ఉంటుంది, ఇది గుండె ఆరోగ్యానికి మంచిది. మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. అయితే, చికెన్‌లో కొన్ని భాగాలు తింటే వాటిలో ఉండే హానికరమైన పదార్థాలు మన శరీరంలోకి చేరి అనారోగ్య సమస్యలను కలిగిస్తాయి. కనుక వాటిని తినకపోవడమే మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. చికెన్ మెడ: చాలామంది కోడి మెడ భాగాన్ని ఇష్టంగా తింటారు. ఎందుకంటే దీనికి రుచి ఎక్కువగా ఉంటుంది. అయితే ఈ భాగంలో కోడి శోషరస వ్యవస్థ ఉంటుంది. ఇది శరీరంలోని వ్యర్థాలు, బ్యాక్టీరియాలను బయటకు పంపుతుంది. ఈ భాగంలో విషతుల్య పదార్థాలు కోడి శరీరంలో చేరే ప్రమాదం ఉంది. ఈ భాగాన్ని తింటే, వాటిలో ఉండే హానికరమైన పదార్థాలు మన శరీరంలోకి చేరి అనారోగ్య సమస్యలను కలిగిస్తాయి. అందుకే కోడి మెడను తినకూడదు. ఇ మోడీకి ట్రంప్ తాజా ఆఫర్..! సై అంటే మీ వాళ్ల జోలికి రాం..? చికెన్ తోక: చికెన్ తోకలో హానికరమైన బ్యాక్టీరియాలు, క్రిములు ఉంటాయి. ఇవి ఎంత ఉడికించినా నశించవు. ఈ క్రిములు మన శరీరంలోకి చేరి కొత్త ఆరోగ్య సమస్యలు తెస్తాయి. కాబట్టి ఈ భాగాన్ని తినకుండా ఉండటమే మంచిది. చికెన్ ఊపిరితిత్తులు: కోడిని కోసినప్పుడు ఊపిరితిత్తులను సాధారణంగా పడేస్తుంటారు. కానీ కొంతమంది వాటిని ఇష్టంగా తింటారు. నిపుణులు మాత్రం ఇవే చాలా ప్రమాదకరమని చెబుతున్నారు. ఎందుకంటే, వీటిలో అత్యంత హానికారకమైన క్రిములు ఉంటాయట. వీటిని తినడం వలన ప్రమాదకరమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. అందుకే, వాటిని తినకుండా ఉండటమే మంచిది. చికెన్ చర్మం: చికెన్ చర్మంలో కొవ్వు ఎక్కువగా ఉంటుంది. ఇది ఆరోగ్యానికి హాని చేస్తుంది. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు చికెన్ చర్మానికి దూరంగా ఉండాలి.



# బ్యాడ్ కొలెస్ట్రాల్ డేంజర్ బెల్స్ మోగిస్తుందని చెప్పే ప్రమాదకర లక్షణాలివే!



చెడు ఆహారపు అలవాట్లు, చెడు జీవన శైలి కారణంగా మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తయారవుతుంది. రక్తనాళాలలో పేరుకుపోయే చెడు కొలెస్ట్రాల్ ను పట్టించుకోకపోతే బ్లాకేజ్ ముప్పు పెరుగుతుంది. మన గుండె ఆరోగ్యం దెబ్బతింటుంది. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. కొలెస్ట్రాల్ ప్రమాదకర లక్షణాలు మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ఏ మేరకు ఉంది తెలుసుకోవడానికి కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉన్నవారిలో కొన్ని ప్రమాదకర లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలను గమనించినట్లయితే కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నదని నమ్మి కచ్చితంగా వైద్యున్ని సంప్రదించాల్సిందే. ఇక ఆ లక్షణాలు ఏమిటో తెలుసుకుందాం. రఘురామ కేసులో మరో కీలక పరిణామం-హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే..! కొలెస్ట్రాల్ ఎలా ఉంది ఇలా తెలుసుకోవాలి సహజంగా కొలెస్ట్రాల్ గురించి తెలుసుకోవాలని భావించేవారు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలి. 45 సంవత్సరాల వయసు వచ్చేవరకు ప్రతి ఐదేళ్లకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఇక ఆ తర్వాత 45 ఏళ్లు దాటాక ప్రతి రెండేళ్లకు వైద్య పరీక్షలు చేయించుకోవాలి. లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్ చేయించుకోవాలి. ఇక ఈ పరీక్షలు ఏమీ లేకుండానే కొలెస్ట్రాల్ గురించి తెలిపే కొన్ని సంకేతాలు మన శరీరంపైన కూడా కనిపిస్తాయి. కళ్ళపై మచ్చలు ఉన్నాయా? కళ్ళపై పసుపు రంగు మచ్చలు వస్తే శరీరంలో కొలెస్ట్రాల్ లెవెల్స్ అధికంగా ఉన్నట్టు అర్థం. కంటి రెప్ప పై భాగంలో కానీ కింది భాగంలో కానీ పసుపు రంగులో కొవ్వు పేరుకుని మచ్చ కనిపిస్తుంది. ఇక రెండవది కాళ్లలో నొప్పులు కనిపిస్తాయి. తరచూ అదేపనిగా కాలి మడమల్లో తీవ్రమైన నొప్పి కలుగుతుంటే కొలెస్ట్రాల్ అధికంగా ఉందనే అర్థం. అయితే ఈ నొప్పి కాసేపు విశ్రాంతి తీసుకుంటే తగ్గుతుంది. మళ్ళీ వస్తుంది. కొలెస్ట్రాల్ ఉన్నవారిలో ఈ ప్రమాదకర సంకేతాలు ఇక కొలెస్ట్రాల్ విపరీతంగా ఉన్న వారిలో కొంతమంది నడిచేటప్పుడు బ్యాలెన్స్ కోల్పోతారు. తడబడుతున్నట్లుగా నడుస్తారు. ఈ పరిస్థితినీ తేలికగా తీసుకోకూడదని ఇది చాలా ప్రమాదకరమని అంటున్నారు వైద్య నిపుణులు. ఇక కొంతమందిలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటే చర్మం పైన పొక్కులు రావడం, దద్దుర్లు వంటివి రావడం జరుగుతూ ఉంటుంది. ముఖ్యంగా ఇవి కీళ్లు, మోకాళ్లు మరియు జాయింట్లలో కనిపిస్తాయి."రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉండే బ్లడ్ గ్రూప్ ఏదో తెలుసా?" ఛాతీలో ఇలా ఉంటుందా ? కళ్ళలో తెల్లని చారలు వస్తున్నాయా? కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారిలో ఛాతిలో నొప్పి విపరీతంగా వస్తుంది. ఒకవేళ అలా వస్తే గుండె సంబంధిత సమస్యగా భావించి వైద్యులను సంప్రదించాలి. ఇంకా బ్యాడ్ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారిలో కనిపించే మరో ప్రమాదకరమైన లక్షణం కళ్ళల్లో తెల్లని చారలు రావడం.. కంటి చుట్టూ లేదా కంట్లో తెలుపు చారలు కనిపిస్తే అది మన శరీరంలోని కొలెస్ట్రాల్ కు అద్దం పడుతుంది. బ్యాడ్ కొలెస్ట్రాల్ ఎక్కువ ఉందని చెప్పే లక్షణాలివే.. జాగ్రత్త ఈ లక్షణాలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని కొలెస్ట్రాల్ అధికంగా ఉంటే ఈ పరిస్థితి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అందుకే బ్యాడ్ కొలెస్ట్రాల్ విషయంలో ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుంటూ కొలెస్ట్రాల్ ని కంట్రోల్ చేసే లాగా మెడిసిన్స్ తీసుకోవడంతో పాటు జీవన శైలిని మార్చుకోవాలి.

# టాబ్లెట్లు వేసుకుంటున్నారా? ఈ ఒక్క పనిమాత్రం చేయొద్దు

ఈ రోజుల్లో టాబ్లెట్లు వేసుకోని వ్యక్తి లేదు అంటే అతిశయోక్తి కాదు. చిన్న తలనొప్పి నుంచి పెద్ద పెద్ద జబ్బుల వరకు దాదాపుగా అందరూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం గుప్పెడు టాబ్లెట్లు వేసుకోవాల్సిందే. మరికొందరైతే చిన్న చిన్న వాటికి కూడా అనవసరంగా టాబ్లెట్లు వేసుకుంటూ అనవసరమైన అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారు. టాబ్లెట్లు వేసుకునే సమయంలో తీసుకోవాల్సిన పదార్థాలు, తీసుకోకూడని పదార్థాలు ఉన్నాయి. తీసుకోకూడని పదార్థాలు ఏమిటనేది తెలుసుకుందాం. తీసుకోకూడనివి ఆల్కహాల్... ఆల్కహాల్ టాబ్లెట్ల ప్రభావానికి ఆటంకం కలిగిస్తుంది మరియు దుష్ప్రభావాల ప్రమాదాన్ని పెంచుతుంది. కొన్ని సందర్భాల్లో, ఇది ప్రాణాంతకం కావచ్చు. ద్రాక్షరసం... గ్రేప్‌ఫ్రూట్ జ్యూస్‌లోని కొన్ని పదార్థాలు కొన్ని రకాల టాబ్లెట్ల పనితీరును ప్రభావితం చేస్తాయి, వాటిని ఎక్కువ లేదా తక్కువ ప్రభావవంతంగా చేస్తాయి. పాలు... పాలు కొన్ని రకాల టాబ్లెట్ల శోషణను తగ్గిస్తాయి, వాటిని తక్కువ ప్రభావవంతంగా చేస్తాయి. కొన్ని ఆహారాలు... కొన్ని ఆహారాలు, ముఖ్యంగా కొవ్వు అధికంగా ఉండే ఆహారాలు, కొన్ని రకాల టాబ్లెట్లు శోషణను తగ్గిస్తాయి. ఇతర టాబ్లెట్లు... మీరు తీసుకుంటున్న ఇతర టాబ్లెట్ల గురించి మీ డాక్టర్‌కు చెప్పడం చాలా ముఖ్యం, ఎందుకంటే కొన్ని కలయికలు ప్రమాదకరమైనవి కావచ్చు. మెడిసిన్స్ వేసుకోవడానికి అవసరమైన సలహాలను కచ్చితంగా వైద్యులను అడిగి తెలుసుకోవాలి. మోడీకి ట్రంప్ తాజా ఆఫర్..! సై అంటే మీ వాళ్ల జోలికి రాం..? తీసుకోవాల్సినవి నీరు... టాబ్లెట్లు వేసుకోవడానికి నీరు ఉత్తమమైనది. ఇది టాబ్లెట్లను సులభంగా మింగడానికి, కడుపులో కరగడానికి సహాయపడుతుంది. ఆహారం...



కొన్ని టాబ్లెట్లను ఆహారంతో తీసుకోవాలని డాక్టర్ సిఫార్సు చేస్తారు. ఇది కడుపులో చికాకును నివారించడానికి సహాయపడుతుంది. పానీయాలు... కొన్ని రకాల టాబ్లెట్లను జ్యూస్ లేదా పాలతో తీసుకోవచ్చు. అయితే దీనిపై వైద్యులతో, ఫార్మసిస్టులతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలి. కొన్ని టాబ్లెట్లను ఆహారంతో లేదా తిన్న వెంటనే తీసుకోవాలి. ఇది కడుపులో చికాకును నివారించడానికి, టాబ్లెట్ యొక్క శోషణను మెరుగుపరచడానికి సహాయపడుతుంది. మరికొన్ని టాబ్లెట్లను ఆహారానికి కనీసం ఒక గంట ముందు లేదా రెండు గంటల తర్వాత తీసుకోవాలి. ఇది టాబ్లెట్ యొక్క శోషణను పెంచడానికి సహాయపడుతుంది.

# పంచదారకు బదులుగా బెల్లం తీసుకుంటున్నారా? ఇది తెలుసుకోండి

ప్రస్తుత రోజుల్లో చాలామంది పంచదార వాడకం తగ్గించేస్తున్నారు. మధుమేహానికి భయపడటంతోపాటు పంచదార తింటే అనేక అనారోగ్యాలు కలుగుతాయనే భయంతో సాధ్యమైనంతవరకు పంచదారకు, పంచదారతో చేసిన తీపి పదార్థాలకు దూరంగా ఉంటున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా బెల్లం వాడుతున్నారు. బెల్లం కూడా తెల్లగా ఉంటోంది. అలా కాకుండా రంగులేని బెల్లం వాడాలని నిపుణులు సూచిస్తున్నారు. పంచదారకన్నా బెల్లంలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తుంది. బెల్లం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది... బెల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది... బెల్లం జీర్ణక్రియను మెరుగుపరిచి మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. రక్తహీనతను నివారిస్తుంది... బెల్లంలో ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల రక్తహీనతను నివారిస్తుంది. ఎముకలు బలపడతాయి... బెల్లంలో కాల్షియం ఉండటం వల్ల ఎముకలు బలపడతాయి. శక్తిని ఇస్తుంది... బెల్లంలో ఐరన్, కాల్షియం, జింక్ వంటి ముఖ్యమైన ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని ఇస్తాయి. కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది... బెల్లంలో డిటాక్సిఫైయింగ్ గుణాలు ఉన్నాయి. దీన్ని



తినడం వల్ల కాలేయం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. మోడీకి ట్రంప్ తాజా ఆఫర్..! సై అంటే మీ వాళ్ల జోలికి రాం..? పంచదార కంటే బెల్లం ఎందుకు మంచిది? సహజ తీపి... బెల్లం సహజంగా తయారయ్యే తీపి పదార్థం. దీని తయారీలో ఎలాంటి రసాయనాలు వాడరు. పోషకాలు ఎక్కువ... బెల్లంలో పంచదార కంటే ఎక్కువ పోషకాలు ఉంటాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది... బెల్లం గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. అందువల్ల ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతుంది. జీర్ణక్రియకు మేలు చేస్తుంది... బెల్లం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.



# సినిమా



# ఇదంతా నా వల్లే అంటూ అర్ధరాత్రి లేచి మరీ సారీ చెప్పాడు



అటు హీరోగా, ఇటు నిర్మాతగా వరుస సినిమాలతో సక్సెస్ లు అందుకుంటూ దూసుకెళ్తున్నారు నేచురల్ స్టార్ నాని. సినిమాల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ నాని తన ఫ్యామిలీకు సరైన సమయాన్ని కేటాయిస్తూ వారితో టైమ్ స్పెండ్ చేస్తూ ఉంటారు. ఫ్యామిలీతో కలిసి వెకేషన్స్ కు వెళ్లడమే కాకుండా వాటికి సంబంధించిన ఫోటోలను కూడా ఫ్యాన్స్ తో షేర్ చేస్తూంటారు నాని. జయమ్ము నిశ్చయమ్మురా షోకు గెస్టుగా నాని రీసెంట్ గా ఫ్యామిలీ తో కలిసి వినాయక చవితిని సెలబ్రేట్ చేసుకున్న నాని, ఓ వీడియోను పోస్ట్ చేయగా ఆ వీడియోలో నాని కొడుకు అర్జున్ శ్లోకాలు చదువుతూ కనిపించారు. నాని కొడుకు అర్జున్ ముద్దు పేరు జున్ను. ఇంట్లో అందరూ అర్జున్ ను అలానే పిలుస్తారట. అయితే ఇటీవల జున్ను కాలికి దెబ్బ తగలి ఫ్రాక్చర్ అయినట్టు నాని జగపతిబాబు హోస్ట్ గా వ్యవహరిస్తున్న జయమ్ము నిశ్చయమ్మురా టాక్ షో లో తెలిపారు.పిల్లలకేమైనా అయితే వారి ఫేస్ చూడలేం సంవత్సరం కిందట జున్ను కాలికి ఫ్రాక్చర్ అయిందని, సైకిల్ మీద నుంచి పడి బోన్ ఫ్రాక్చర్ అయిందని, కదలడానికి కూడా లేకుండా అయిందని, కాలు కొంచెం జరిపినా నొప్పి అనేవాడని, బాత్‌రూమ్ కి కూడా తామే తీసుకెళ్లేవాళ్లమని, పిల్లలకు ఏమైనా అయినప్పుడు వాళ్ల ఫేస్ చూడలేమని, చాలా బాధ అనిపిస్తుందని నేచురల్ స్టార్ నాని చెప్పుకొచ్చారు. అర్థరాత్రి లేచి ఏడ్చేవాడు ఒక్కోసారి అర్ధరాత్రి నిద్ర లేచి నొప్పిగా ఉందని ఏడ్చేవాడని, ఆ టైమ్ లో తనకు, తన భార్యకు సరిగ్గా నిద్ర కూడా ఉండేది కాదని, ఒక రోజు అర్ధరాత్రి జున్ను సడెన్ గా నిద్ర లేచి సారీ నాన్న అన్నాడని, నాకెందుకు సారీ చెప్తున్నావు అనడిగితే నా వల్ల మీ అందరికీ నిద్ర ఉండట్లేదు కదా అన్నాడని, చిన్న పిల్లాడు అంత పెద్ద మాట అనేసరికి ఒళ్లు ఝుల్లుమందని నాని ఎమోషనల్ అయ్యారు. ఇక కెరీర్ విషయానికొస్తే నాని ప్రస్తుతం దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ది ప్యారడైజ్ సినిమా చేస్తున్న విషయంతెలిసిందే

# గోల్డెన్ కలర్ లెహంగాలో గ్లామర్ తో అలరించిన రుక్మిణి!




రుక్మిణి వసంత్... ఈ పేరు గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు.. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఈమె గురించే చర్చ జరుగుతోంది. కారణం వరుసగా పాన్ ఇండియా సినిమాలలో అవకాశం అందుకోవడమే అని చెప్పాలి. ప్రస్తుతం ఈమె.. కోలీవుడ్ లో ఏ.ఆర్.మురగదాస్ దర్శకత్వంలో శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న 'మదరాసి' అనే సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. సెప్టెంబర్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఇందులో గోల్డెన్ కలర్ లెహంగా ధరించి తన గ్లామర్ తోనే అందరి దృష్టిని ఆకట్టుకుంది. అంతేకాదు అందంతో ఈ ఈవెంట్ కి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలిచింది రుక్మిణి వసంత్. అసలు విషయంలోకి వెళ్తే.. మదరాసి ప్రీ రిలీజ్ ఈవెంట్ లో భాగంగా గోల్డెన్ కలర్ లెహంగా ధరించిన ఈమె.. దీనికి పర్ఫెక్ట్ మ్యాచింగ్ లో సాఫ్ట్ దుపట్టా ధరించి.. తన అందాన్ని మరింత రెట్టింపు చేసుకుంది. అంతేకాదు సింపుల్ జువెలరీతో మరింత ప్రకాశవంతంగా వెలిగిపోయింది. అటు అందంగా కనిపించడమే కాకుండా ఇటు సాంప్రదాయంగా కూడా కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకుంది రుక్మిణి వసంత్.. సింపుల్ లుక్ తో.. మరింత గ్లామర్ వలకబోస్తూ ఎటువంటి హుందాతనం లేకుండా చాలా సైలెంట్ గానే అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం రుక్మిణి వసంత్ ధరించిన ఈ అవుట్ ఫిట్ అభిమానులను కూడా ఆకట్టుకుంటుంది అని చెప్పవచ్చు.్న్ రుక్మిణి వసంత్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం వరుస పెట్టి పాన్ ఇండియా స్టార్ హీరోల చిత్రాలలో అవకాశాలు అందుకుంటుంది. అందులో భాగంగానే ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వస్తున్న 'డ్రాగన్' అనే సినిమాలో ఈమె హీరోయిన్ గా ఎంపికయింది.. అంతేకాదు 'కాంతార' సినిమాతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న రిషబ్ శెట్టి ప్రస్తుతం 'కాంతార : చాప్టర్ వన్' అంటూ అక్టోబర్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఇందులో కూడా హీరోయిన్ గా రుక్మిణి వసంత్ నటిస్తోంది. అలాగే కేజీఎఫ్ చిత్రాలతో సంచలనం సృష్టించిన యష్ తాజాగా నటిస్తున్న చిత్రం టాక్సిక్. ఇందులో కూడా రుక్మిణి హీరోయిన్ గా అవకాశం అందుకుంది.. ఇలా వరుసగా పాన్ ఇండియా చిత్రాలలో.. బడా హీరోలతో అవకాశాలు అందుకోవడంతో సైలెంట్ గానే పెద్ద పెద్ద ప్రాజెక్టులలో అవకాశాలు అందుకుంది అంటూ నెటిజన్స్ కూడా కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈమె లైనప్ గురించి మదరాసి ప్రీ రిలీజ్ ఈవెంట్లో నిర్మాత ఎన్.వీ. ప్రసాద్ స్పష్టం చేశారు. రుక్మిణి వసంత్ కెరియర్.. నిఖిల్ హీరోగా నటించిన 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది కన్నడ ముద్దుగుమ్మ. 1994 డిసెంబర్ 10న కర్ణాటకలోని బెంగళూరులో జన్మించింది. ఈమె తండ్రి కల్నల్ వసంత్ వేణుగోపాల్. ఈయన భారతదేశ అత్యున్నత శాంతికాల సైనిక అలంకరణ అయిన అశోక చక్ర కర్ణాటక రాష్ట్రం నుండి అందుకున్న మొదటి వ్యక్తిగా గుర్తింపు సంపాదించుకున్నారు.. ఈమె లండన్ లోని బ్లూమ్స్ బరీ లోని రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమాటిక్ ఆర్ట్స్ నుండి నటన పట్టా అందుకుంది

# రానాతో అనుష్క ఫోన్ ముచ్చట్లు.. ఫైనల్ గా అది చెప్పేసింది..!

: స్వీటీ అనుష్క ఫ్యాన్స్ కి ఒక అదిరిపోయే న్యూస్ చెప్పింది. ఇక మీదట అనుష్క వరుస సినిమాలు చేస్తుందట. ఈ ఇయర్ ఎండింగ్ లేదా నెక్స్ట్ ఇయర్ నుంచి అనుష్క వరుసగా సినిమాలు చేస్తుందట. ఈ విషయం ఎవరో చెప్పడం కాదు స్వయంగా అనుష్క తన మాటలతోనే చెప్పింది. సెప్టెంబర్ 5న ఘాటి సినిమా రిలీజ్ అవుతుంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో డైరెక్ట్ గా పాల్గొనలేదు అనుష్క. ఐతే రానాతో అనుష్క ఫోన్ సంభాషణల్లో ఘాటి సినిమా ఎక్స్ పీరియన్స్ ని షేర్ చేసుకుంది. ఘాటి సినిమా చేయడం ఒక గొప్ప ఎక్స్ పీరియన్స్ గా భావిస్తున్నా అని అనుష్క చెప్పింది. పవర్ ఫుల్ రోల్ లో అనుష్క.. క్రిష్ అంతకుందు వేదం సినిమాలో సరోజ పాత్ర ఇచ్చారు.. ఇప్పుడు షీలా లాంటి పవర్ ఫుల్ రోల్ ఇచ్చారని అన్నారు అనుష్క. ఘాటిల లైఫ్ గురించి వాళ్ల ప్రపంచంలో జరిగే విషయాల గురించి ఈ సినిమా చాలా ఆసక్తికరంగా ఉంటుందని.. ఘాటిలుగా ఉన్న షీలా ఎలా పవర్ ఫుల్ ఉమెన్ గా మారిందే ఈ సినిమా కథ అని అన్నారు అనుష్క. ఐతే ఈ కథ ఇప్పుడు చెప్పాల్సిన అవసరం ఉందని ఇది కరెక్ట్ టైం అని అన్నారు అనుష్క. ఇక కత్తి పట్టి చేసే సినిమాలన్నిటికీ తననే ఎంపిక చేస్తున్నారని అనుష్క అనగా.. అలాంటి పాత్రలకు నువ్వు పర్ఫెక్ట్ అని రానా అన్నారు. ఇక సినిమాలు ఎక్కువ చేయట్లేదు. మళ్లీ ఎప్పుడు వరుసగా సినిమాలు చేసావ్ అని రానా అడిగితే.. దానికి సమాధానంగా అనుష్క ఇక మీదట



వరుస సినిమాలు చేస్తానని చెప్పుకొచ్చారు. రానా అనుష్క ఫోన్ సంభాషణలు అనుష్క ఫ్యాన్స్ ని సర్ ప్రైజ్ చేస్తున్నాయి. రానాతో ఘాటి సినిమా విషయాలు.. ఆఫ్టర్ లాంగ్ టైం అనుష్క నుంచి వచ్చిన ఈ ఆడియో చాట్ ఆడియన్స్ ని ఖుషి చేస్తుంది. అనుష్క కెమెరా ముందుకొచ్చి ప్రమోషన్స్ లో పాల్గొనేందుకు కాస్త ఇబ్బందిగా ఫీల్ అవుతుంది. అందుకే ఘాటి ప్రమోషన్స్ బాధ్యత అంతా కూడా డైరెక్టర్ క్రిష్ తన భుజాన వేసుకున్నారు. ఐతే అనుష్క లేటెస్ట్ గా ఘాటి గురించి సోషల్ మీడియాలో వచ్చిన ఒక ంఎ వీడియోని షేర్ చేసింది. అంతేకాదు రానాతో ఘాటి సినిమా గురించి ఇంట్రెస్టింగ్ విషయాలు చర్చించారు. ఈ డిస్కషన్ లో అనుష్క నెక్స్ట్ ఇయర్ నుంచి కంటిన్యూగా సినిమాలు చేస్తా అని చెప్పం స్వీటీ ఫ్యాన్స్ కి సూపర్ జోష్ తెచ్చింది. మరి చెప్పినట్టు అనుష్క వరుస సినిమాలు చేస్తుందా లేదా అన్నది చూడాలి.



# ఎట్టకేలకు రిలీజ్ కాబోతున్న కార్తీ మూవీ

: తమిళ హీరో అయినప్పటికీ కార్తీకి తెలుగులో కూడా మంచి క్రేజ్ ఉంది. ఇంకా చెప్పాలంటే కార్తీని తమిళ హీరో అని తెలుగు ఆడియన్స్ అసలు భావించరు. వరుస సినిమాలతో కార్తీ కెరీర్లో ముందుకు దూసుకెళ్తూ చాలా బిజీగా ఉన్నారు. ప్రస్తుతం కార్తీ మార్షల్, సర్దార్2 సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. అయితే కార్తీ వరుసగా సినిమాలను చేస్తున్నప్పటికీ అందులో ఓ సినిమా మాత్రం ఇబ్బందులకు గురవుతూ వస్తోంది. కార్తీ సరసన కృతి శెట్టి  అదే వా వాతియార్. స్టూడియో గ్రీన్ బ్యానర్ లో జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్న ఈ సినిమాకు నలన్ కుమారస్వామి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీలో కార్తీ సరసన కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తుండగా సత్యరాజ్, రాజ్ కిరణ్, ఆనంద రాజ్, శిల్పా మంజునాథ్, కరుణాకరణ్, సుందర్, రమేష్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కార్తీ కెరీర్లో 26వ సినిమాగా తెరకెక్కుతున్న వా వాతియార్ ఇప్పటికే రిలీజ్ కావాల్సింది. కార్తీ స్పీడుకు బ్రేకులేసిన నలన్  సినిమా అనౌన్స్ చేసి రెండేళ్లవుతున్నప్పటికీ ఇంకా వా వాతియార్ రిలీజ్ కాలేదు. ఓ వైపు కార్తీ మిగిలిన సినిమాలన్నింటినీ జెట్ స్పీడులో పూర్తి చేసి రిలీజ్ చేస్తుంటే ఈ సినిమా మాత్రం వాయిదా మీద వాయిదా పడుతూ కార్తీ స్పీడుకు బ్రేకులేస్తూ వచ్చింది. ఈ సినిమా తర్వాత మొదలుపెట్టిన సత్యం సుందరం, సర్దార్ కూడా రిలీజై మంచి హిట్లుగా నిలిచాయి. దీంతో ఒకానొక టైమ్ లో వా వాతియార్ ఆగిపోయిందని కూడా వార్తలొచ్చాయి. అయితే ఎట్టకేలకు అన్నింటినీ అధిగమించి ఈ సినిమాను పూర్తి చేశారు నలన్. పలుమార్లు వాయిదా ముందు వా వాతియార్ ను జనవరిలో రిలీజ్ చేద్దామనుకున్నారు కానీ అప్పటికి షూటింగ్ పూర్తవలేదు. ఆ తర్వాత జూన్ లో అనుకుంటే అదీ కుదరలేదు. సెప్టెంబర్ 5కి రిలీజ్ చేద్దామంటే వీలవలేదు. దీంతో కార్తీ ఫ్యాన్స్ ఈ సినిమాపై ఆశలు వదిలేసుకున్నారు. ఇక ఇప్పట్లో ఈ సినిమా రిలీజవడం కష్టమేనని నిరాశ పడుతున్న టైమ్ లో ఈ మూవీ రిలీజ్ గురించి మేకర్స్ ఓ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. డిసెంబర్ లో వా వాతియార్ వా వాతియార్ డిసెంబర్ లో రిలీజ్ కాబోతున్నట్టు హింట్ ఇస్తూ ఓ పోస్టర్ ను రిలీజ్ చేసి సినిమాపై ఉన్న అంచనాలను పెంచారు. వర్షంలో తడుస్తూ కార్తీ గుర్రంపై వస్తున్నట్టు ఈ పోస్టర్ లో కనిపిస్తోంది. అందరినీ శాసించే రాజు రాకకు రంగం సిద్ధమైందని, ఈ డిసెంబర్ లో వాతావరణం మారబోతోందనే క్యాప్షన్ ను రాసుకొచ్చారు. దీంతో వా వాతియార్ డిసెంబర్ లో రిలీజ్ ఖాయమని తెలిసి కార్తీ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. మరి ఇప్పుడైనా ఈ సినిమా డిసెంబర్ లో వస్తుందో లేదో చూడాలి.



# కాళేశ్వరాన్ని శాశ్వతంగా మూసేసే కుట్ర

**: మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి**

చందూరు, సెప్టెంబర్ 02 : తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసేసి, గోదావరి నది జలాలను ఆంధ్రాకు తరలించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నట్లు మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చందూరు మున్సిపల్ కేంద్రంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ కుట్రలకు నిరసనగా భారీగా బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..




బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో సాగునీరు అందించి, రైతన్న ముఖంలో సంతోషాన్ని నింపిన కేసీఆర్ పై కాళేశ్వరం కమిషన్ విచారణ పేరిట తప్పుడు నోటీసులు పంపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎన్నో లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయని ఈ ఘనత కేసీఆర్ కే దక్కిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి చేస్తున్న ఈ కుట్రలను ఎదుర్కోవాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు.బెదిరింపులు, కేసులు బీఆర్ఎస్ పార్టీకి కొత్త కాదని, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చందూరు మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, చందూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తోకల చంద్రకళ వెంకన్న, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీశ్, కౌన్సిలర్ కోడి వెంకన్న, అధికార ప్రతినిధి బొడ్డు సతీశ్ గౌడ్, ఉపాధ్యక్షుడు కురుపాటి సుదర్శన్, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పెద్దగోని వెంకన్న గౌడ్, ఇరిగి రామన్న, ఇరిగి గురునాథం, తేలుకుంట్ల చంద్రశేఖర్, మహిళ మండల అధ్యక్షురాలు పెండ్యాల గీత, సంగేపు సువర్ణ, బీఆర్ఎస్ అన్ని మండలాల అధ్యక్షులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# హరీశ్‌రావుపై ఆరోపణలు.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఏమన్నారంటే..?



హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావుపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎక్స్ వేదికగా స్పందించారు. హరీశ్‌రావుపై చేసిన ఆరోపణలు తనను షాక్‌కు గురి చేశాయన్నారు ఆర్ఎస్పీ. తాను బీఆర్ఎస్ పార్టీలో చేరి ఏడాది కాలం అయి ఉండొచ్చు. కానీ హరీశ్‌రావు సమయపాలన, ఓర్పు, స్నేహభావంతో పాటు ఆయన కృషి, ఆలోచన విధానాలపై తనకు అపారమైన అభిమానం ఏర్పడిందన్నారు. అధికార యంత్రాంగంలో కూడా చాలా మందికి ఈ లక్షణాలన్నీ లేవు అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. అవినీతిమయమైన కాంగ్రెస్, బిజెపి కూటమి నుండి తెలంగాణను విముక్తి చేయడానికి సన్నద్ధం కావాల్సిన సమయం ఇది అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.


# పాకిస్థాన్‌కు మద్దతిచ్చినందుకే భారత్ మమ్మల్ని దెబ్బకొట్టింది : అజర్‌బైజాన్



షాంఘై సహకార సంస్థ సదస్సులో పూర్తి సభ్యత్వం కోసం అజర్‌బైజాన్ చేసిన ప్రయత్నాన్ని భారత్ అడ్డుకుంది. ఈ చర్యపై అజర్‌బైజాన్ స్పందించింది. తాము పాకిస్థాన్ తో సన్నిహిత సంబంధాలు కొనసాగించడం వల్లే భారత్.. ప్రపంచ వేదికలపై తమను దెబ్బకొట్టిందని భారత్‌పై అక్కసు వెళ్లగక్కింది.ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్‌కు సహకారం అందించినందుకే షాంఘై సహకార సంస్థలో పూర్తి సభ్యత్వం కోసం తాము చేసిన ప్రయత్నాన్ని భారత్ అడ్డుకుందని ఆరోపించింది. ఈ చర్యలు బహుపాక్షిక దౌత్య ఉల్లంఘనలేనని ప్రేలాపన చేసింది. అంతర్జాతీయ వేదికల్లో తమపై భారత్ ఎన్ని చర్యలు తీసుకున్నా తాము ఇస్లామాబాద్‌తో సంబంధాలు కొనసాగిస్తామని, అది తమ మిత్ర దేశమని అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అధికప్రసంగం చేశారు.రాజకీయంగా, సాంస్కృతికంగా, వ్యూహాత్మకంగా అజర్‌బైజాన్, పాకిస్థాన్ దేశాల మధ్య లోతైన బంధాలు ఉన్నాయని ఇల్హామ్ వ్యాఖ్యానించారు. చైనాలోని తియాన్‌జిలో ఇటీవల నిర్వహించిన షాంఘై సహకార సంస్థ సదస్సులో అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలీయేవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో సమావేశమై.. ఇటీవల భారత్‌తో జరిగిన ఘర్షణల్లో విజయం సాధించారని పాక్ ప్రధానిని అభినందించారు. ఈ క్రమంలో ఎస్‌సీవోలో అజర్‌బైజాన్ పూర్తి సభ్యత్వానికి భారత్ అడ్డుతగిలింది.పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్థాన్‌తోపాటు, పీవోకేలోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకొని భారత్ ఆపరేషన్ సింధూర్ పేరుతో దాడులు నిర్వహించింది. ఆ సమయంలో అజర్‌బైజాన్ పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతిచ్చింది. తుర్కియే కూడా బహిరంగ మద్దతు తెలిపింది. దాంతో ఆ రెండు దేశాలపై యమన దేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

# కార్టూనిస్టు హేమంత్ మాల్వియాకు ముందస్తు బెయిల్ మంజూరీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్‌పై అభ్యంతరకర కార్టూన్లు వేసిన కార్టూనిస్టు హేమంత్ మాల్వియాకు సుప్రీంకోర్టు ఇవాళ ముందస్తు బెయిల్ మంజూరీ చేసింది. తన కార్టూన్ పట్ల ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లలో మాల్వియా క్షమాపణలు చెప్పినట్లు జస్టిస్ అరవింద్ కుమార ఎన్వీఅంజారి తెలిపారు. ఒకవేళ కార్టూనిస్టు దర్యాప్తునకు సహకరించకుంటే అప్పుడు బెయిల్ ను రద్దు చేసే స్వేచ్ఛను పోలీసులకు కోర్టు వదిలేసింది. మాల్వియా తరపున వృందా గ్రోవర్ వాదించారు. క్షమాపణలు చెప్పామని, కానీ ఇప్పటి వరకు పిటీషనర్‌కు సమన్లు ఇవ్వలేదన్నారు. అన్ని ఆధారాలు సేకరించిన తర్వాత సమన్లు ఇస్తామని అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నాటరాజ్ తెలిపారు.ఓ లాయర్, ఆర్ఎస్ఎస్ వర్కర్ వినయ్ జోషీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మాల్వియాపై మే నెలలో కేసు బుక్ చేశారు. మతపరమైన మనోభావాలను దెబ్బతీసినట్లు ఆ ఫిర్యాదులో ఆరోపించారు. అభ్యంతరకరమైన కార్టూన్లను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేపి డిస్టర్బ్ చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.



# బుగులోని జాతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే.

**- బుగులోని గుట్టలను టూరిజం హబ్ గా చేస్తానన్న ఎమ్మెల్యే**

**- రూ.160 లక్షలతో మెట్ల మార్గం, రెయిలింగ్, కోనేరు నుండి గుట్టపైకి మంచి నీటి సరఫరా పనులు..**

జయశంకర్ భూపాలపల్లి.నమ్మి కొలిస్తే కోరిన కోరికలు తీరుతాయని భక్తులు విశ్వసించే రెండో తిరుపతిగా పేరుగాంచిన బుగులోని వెంకటేశ్వర స్వామి గుట్టలను టూరిజం హబ్ గా అభివృద్ధి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రేగొండ మండలం తిరుమలగిరి గ్రామ శివారు గుట్టల్లో ఉన్న బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర అభివృద్ధి కొరకు అటవీ శాఖ నిధులు రూ. 160 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బుగులోని వెంకటేశ్వర స్వామి గుట్టలను టూరిజం హబ్ గా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఇదివరకే జాతరకు వచ్చే అన్ని రోడ్లకు నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. అట్టి పనులు గుత్తేదారు నిర్లక్ష్యంతో ఆలస్యం జరుగుతున్న మాట వాస్తవమేనన్నారు. పనులు మొత్తం త్వరితగతిన పూర్తి అయ్యేలా చూస్తానన్నారు. రూ. 160 లక్షలతో మెట్లను విస్తరించడం, రెండు వైపులా రెయిలింగ్ ఏర్పాటు, భక్తులకు త్రాగునీటి కొరకు కోనేరు నుండి గుట్టపైకి మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మరిన్ని నిధుల కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఆ నిధులు కూడా మంజూరు అయితే జాతర లో అభివృద్ధి పనులు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంట పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

# భారత్ ఉండాల్సింది అమెరికాతో.. పుతిన్, జిన్‌పింగ్‌తో మోదీ భేటీ సిగ్గుచేటు : ట్రంప్ సలహాదారు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవర్రో మరోసారి భారత్‌పై నోరు పారేసుకున్నారు. భారత్-రష్యా మధ్య వాణిజ్య సంబంధాలపై తీవ్ర విమర్శలు చేశారు. సాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధినేత పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ కావడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు.ఇద్దరు



నియంతలతో మోదీ భేటీ సిగ్గు చేటు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వాషింగ్టన్‌లో జరిగిన మీడియా సమావేశంలో నవర్రో మాట్లాడుతూ.. 'భారత ప్రధాని మోదీ.. పుతిన్, జిన్‌పింగ్‌లతో కలిసి ఉండటం సిగ్గుచేటు. ఆయన ఏమి ఆలోచిస్తున్నారో అర్థం కావడం లేదు. భారత్ కలిసి ఉండాల్సింది అమెరికాతో.. రష్యాతో కాదు' అని వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.ఇండియా దిగుమతులపై 50 శాతం సుంకాన్ని విధిస్తున్న అంశంపై నవర్రో ఇటీవలే తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. భారత ప్రజలను వాడుకుని బ్రహ్మణులు లాభపడుతున్నారని, దీన్ని ఆపాలని ఆయన అన్నారు. రష్యాకు లాండ్రీగా ఇండియా మారినట్లు ఆయన ఆరోపించారు. అమెరికాకు పోటీగా వాణిజ్య అసమానతలను ఇండియా సృష్టిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేయడం వల్లే ఇండియాపై 50 శాతం టారీఫ్ వసూల్ చేస్తున్నట్లు నవర్రో పేర్కొన్నారు. తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో ప్రాఫిటీరింగ్ బ్రహ్మిన్స్ అనే పదాన్ని వాడడం చర్చనీయాంశమైంది. ఆ పదం వాడుకపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. రాజకీయ పార్టీలు భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి.

# 'ప్రజలను డైవర్షన్ చేయడానికే కాళేశ్వరం ప్రాజెక్టుపై బురదజల్లే కుట్ర'

శివ్వంపేట, సెప్టెంబర్ 2 : కాళేశ్వరం ప్రాజెక్టుపై రూపొందించిన కాంగ్రెస్ ప్రభుత్వ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ గోసిలో పెట్టుకోవడానికి కూడా పనిచేయదని మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమణ గౌడ్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రమైన శివంపేట బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను డైవర్షన్ చేయడానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై బురద జల్లే రాజకీయ కుట్ర చేస్తుందని విమర్శించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డికి కనీస అవగాహన లేదన్నారు. కాళేశ్వరంపై అసెంబ్లీలో దమ్మున్న డైనమిక్ లీడర్ హరీశ్ రావు సమాధానాలు చెపుతుంటే కాంగ్రెస్ మంత్రులు నీళ్లు నమిలారని గుర్తు చేశారు. ఓ వైపు రాష్ట్రంలో వరద బాధితులు, యూరియా సమస్య, విద్యుత్ సమస్య, మంచి నీటి సమస్య ఇలా అనేక సమస్యలతో రాష్ట్రం అతలాకుతలం అవుతుందని, గ్రామాలలో సర్పంచ్లు లేక పారిశుద్ధ్యం పడకేసిందని, సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలంటే తమకు భంగపాటు తప్పదని కాంగ్రెస్ ప్రభుత్వం జంకుతుందని విమర్శించారు.ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సారథ్యంలో తామందరం అను నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



# వినియోగంలోకి రుద్రంపూర్ ఈద్గా హ్యాండ్ పంప్



రామవరం, సెప్టెంబర్ 02 : కార్మిక ప్రాంతమైన రుద్రంపూర్ ఈద్గా వద్ద ప్రధాన నీటి వనరు అయిన చేతి పంపు గత కొంతకాలంగా పని చేయడం లేదు. ముస్లింలు వారి ఇళ్లలో ఎవరైనా కాలం చేస్తే అంత్యక్రియలు ఇక్కడే నిర్వహిస్తారు. అంత్యక్రియలు నిర్వహించే సమయంలో అవసరానికి, పండుగ పూటలో నమాజు చేయడానికి వచ్చేవారికి, అలాగే అటవీ ప్రాంతంలో ఏదైనా అవసరం వచ్చే వారు తాగునీటికి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని గ్రామ పంచాయతీ సెక్రటరీ నరేందర్ దృష్టికి తీసుకువెళ్లగా సత్వర చర్యలు తీసుకున్నారు. హ్యాండ్ పంప్‌కు మరమ్మతులు చేయించారు. ఈ చర్యపై ముస్లింలు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# కెసిఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం : వివేకానంద




హైదరాబాద్: ఎమ్మెల్సీ కవిత పనులవల్ల బిఆర్ఎస్ పార్టీకి నష్టం జరుగుతోందని గుర్తించారని బిఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. వివేకానంద మీడియాతో మాట్లాడుతూ.. పార్టీకి నష్టం చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని నిర్ణయం తీసుకున్నారని, తప్పు చేస్తే కుటుంబసభ్యులనైనా సహించని కెసిఆర్ గతంలోనే చెప్పారని తెలియజేశారు. కన్న బిడ్డ కంటే కష్టంలో పార్టీకి అండగా ఉన్నవారే ముఖ్యమని చాటారని, పార్టీ కంటే ఎవరూ పెద్ద కాదన్న విషయం స్పష్టంమైందని వివేకానంద పేర్కొన్నారు.

# పరస్పర ప్రయోజనకర ఒప్పందాలకు సిద్ధమే

**ఏ విషయంలోనూ డెడ్‌లైన్స్ పనిచేయవ్**

**కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూశ్ గోయల్**

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 1(ఆర్ఎన్ఎ): పరస్పరం ప్రయోజనకరమైన ఒప్పందాలకు తాము సిద్ధమని భారత వాణిజ్యశాఖ మంత్రి పీయూశ్ గోయల్ అన్నారు. అమెరికాతో వాణిజ్య చర్చల విషయంలో ప్రతిష్టంభన నెలకొన్న తరుణంలో మంత్రి స్పందించారు. డెడ్‌లైన్స్ పనిచేయవని తేల్చిచెప్పారు. డెడ్‌లైన్స్ పెట్టుకొని మేం వాణిజ్య ఒప్పందాలపై ఎన్నడూ చర్చలు జరపబోం. ఇరువర్గాలకు ప్రయోజనం చేకూర్చే వాణిజ్య ఒప్పందం కోసం మేం ఎల్లప్పుడూ చర్చలకు సిద్ధమే అని పరిశ్రమ వర్గాలతో జరిగిన కార్యక్రమంలో గోయల్ వెల్లడించారు. మార్చిలో మొదలైన భారత్-అమెరికా వాణిజ్య చర్చలు.. ఇప్పటివరకు ఐదు దఫాలుగా జరిగాయి. ఇవి జరుగుతుండగానే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ మనపై సుంకాల మోత మోగించారు. దాంతో గతంలో విధించిన 25 శాతానికి అదనంగా మరో 25 శాతం కలిపి భారత్ ఎగుమతులపై 50శాతం భారం పడుతోంది. ఈ తరుణంలో ఆరవ రౌండ్ చర్చలు ప్రస్తుతానికి వాయిదా పడ్డాయి. మరోపక్క భారత్ యూరోపియన్ యూనియన్ మధ్య వాణిజ్య చర్చలు తుదిదశకు చేరుకున్నాయని, గణనీయమైన పురోగతి ఉందని మంత్రి చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తుల పై సుంకాలు తగ్గించాలని అమెరికా చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. అందుకు ఆమోదిస్తే.. దేశంలోని రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళన ఉంది. ఇది రాజకీయంగా సున్నితమైన అంశం అయినందున.. వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం మినహాయింపునకు భారత్ ససేమిరా అంది. గతంలోనూ ఈ విషయంపై ఇరు దేశాల మధ్య పలుమార్లు చర్చలు జరిగినా ఏకాభిప్రాయం కుదరలేదు.

# రాజకీయ నేతలను మాత్రమే బలిపశువులను చేయడం సరికాదు: దానం

హైదరాబాద్: బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు, సంతోష్ రావు వెనక సిఎం రేవంత్ రెడ్డి ఉన్నాడనేది రాజకీయ ఆరోపణ మాత్రమే అని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై లోతైన విచారణ జరగాలని అన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై దానం స్పందించారు. రాజకీయ నేతలను మాత్రమే బలిపశువులను చేయడం సరికాదని విమర్శించారు. కొందరు అధికారుల దగ్గర వందల కోట్లు బయటపడుతున్నాయని, అలాంటి అధికారుల సంగతి ఏంటీ? అని ప్రశ్నించారు. తనకు స్పీకర్ నుంచి ఎలాంటి నోటీసులు రాలేదని దానం నాగేందర్ పేర్కొన్నారు.



# తమ్మిలేరు వరద ప్రాంతాల్లో కలెక్టర్ పరిశీలన

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు హెచ్చరిక
## గట్టు పటిష్టతపై అధికారులతో ఆరా

ఏలూరు,సెప్టెంబర్2: తమ్మిలేరు వరద దృష్ట్యా ఏలూరు రూరల్ ,అర్బన్ ప్రాంతంలోని లోతట్టు- ప్రాంతాలను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ,జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ లు ఇతర సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం ఉదయం పరిశీలించారు. నగరంలోని తమ్మిలేరు నదీపరివాహక ప్రాంతమైన శనివారపుపేట కాజ్ వే, బాలయోగి వంతెన, తంగెళ్ళమూడి. వంతెన తదితర ప్రాంతాల్లో పర్యటించారు. తమ్మిలేరు వరద మూలంగా సంబంధిత పరివాహక ప్రజలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవలసిన చర్యలు, తమ్మిలేరు వెంట ఉన్న గట్ల పటిష్టతను గురించి క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను వారు ప్రత్యక్షంగా తెలుసుకొనీ అధికారులకు పలు ఆదేశాలు సూచనలను జారీచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఇటీ-వల కురిసిన భారీ వర్షాల కారణంగా తమ్మిలేరు, ఎర్రకాల్వ, గోదావరి తీర ప్రాంతాలకు, కొల్లేరు వరద ప్రభావానికి గురయ్యాయని, వీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఎటు-వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులను, ప్రజలను అప్రమత్తం చేసిన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవలసిందిగా ఆదేశించడం జరిగిందన్నారు. జిల్లాలో గత మూడు రోజుల నుండి 89 మిల్లీమీటర్ల వర్షం కారణంగా నాగిరెడ్డిగూడెం వద్ద నీటిని విడుదల చేయడంతో తమ్మిలేరు పొంగి ప్రవహిస్తున్నదన్నారు. జిల్లాలో తమ్మిలేరు వరద కారణంగా చింతలపూడి, లింగపాలెం,పెదవేగి, చాట్రాయి, ముసునూరు మండలాలలోని గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా ఎర్రకాల్వ వరద కారణంగా జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం లో వరద పరిస్థితులు ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని డివిజన్ కేంద్రాలలో లైఫ్ జాకెట్లు-, రోప్ లు వంటివి సిద్ధం చేయడం జరిగిందని, ప్రజలెవ్వరూ వరద ఉధృతి పరిస్థితులకు వద్దకు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కొల్లేరు లంక గ్రామాలలో బోట్లలో ప్రయాణించవద్దని, ఈ విషయాన్నీ ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు టాంటాం ద్వారా తెలియజేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. భద్రాచలం వద్ద గోదావరి వరద నీటి మట్టం రెండవ ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరి, తగ్గుముఖం పట్టి, ప్రస్తుతం 41 అడుగుల వద్ద ఉందన్నారు. గోదావరి వరద ముంపు ప్రాంతంలోని ప్రజలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు, పాలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో వరద పరిస్థితులు తగ్గుముఖం పెట్టేవరకు ప్రజలు, అధికారులు అప్రమత్తంతో ఉండాలని కలెక్టర్ చెప్పారు. గతం లాగా వరద వస్తే అందుకు తగిన విధంగా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు- సిద్ధం చేసుకోవాలన్నారు. గట్ల పటిష్టతను పరిశీలించి బలహీనమైన చోట్ల అవసరమైన ఇసుక బస్తాలు, తదితర సామాగ్రితో పటిష్టం చేయాలన్నారు. అత్యవసర పరిస్థితిలో ఎక్కడైనా వరద ప్రవాహానికి గండి కొట్టవలసిన పరిస్థితి ఉంటే అందుకు అవసరమైన ప్రో-ల్క÷కె-నర్ ముందుగానే అందుబాటు-లోకి తెచ్చుకోవాలని, ముంపు ప్రమాదం ఏర్పడే వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. .అదేవిధంగా ఆటో ద్వారా మైక్ ద్వారా కూడా సమాచారం ముందుగానే తెలియజేయాలన్నారు. గతంలో తమ్మిలేరు వరదలను దృష్టిలో పెట్టు-కొని చర్యలు చేపట్టాలని తెలిపారు. తమ్మిలేరు రిజర్వాయర్ లో నీటిసామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారులు తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తమ్మిలేరు కాలువకు సంబంధించి ఏలూరులో నాలుగు పాయింట్లు- వద్ద సంబంధిత అధికారులు 24 గంటలు పర్యవేక్షణలో ఉండి, ప్రజలెవ్వరూ వరదనీటిలో దాటకుండా చూడాలన్నారు. ప్రజలను అప్రమత్తం చేయడానికి ముందుగానే హెచ్చరికలను జారీచేయవల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.ఇరిగేషన్ ఇంజనీర్లు తో పాటు- నగరపాలక సంస్థ ఇంజనీర్లను ఆయా 4 పాయింట్లు- లో సిబ్బందిని పర్యవేక్షణకు ఉంచాలన్నారు. సంబంధిత అధికారులు పేర్లు,ఫోన్ నెంబర్ల తో సహా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. వరద ప్రభావం దృష్టిలో ఉంచుకుని ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. జిల్లా ఎస్పీ కెపీఎస్ కిషోర్ మాట్లాడుతూ నాగిరెడ్డి గూడెం వద్ద తమ్మిలేరు వరద నీటి విడుదల ఎపటికప్పుడు రెవెన్యూ పోలీసు అధికారులతో పాటు- ప్రజలకు సమాచారం ఇవ్వాలన్నారు. అదే సమయంలో ఆటో ద్వారా మైక్ లో వరద ప్రమాద హెచ్చరికలను ఆయా ప్రాంత వాసులకు తెలీజేయాలన్నారు. తమ్మిలేరు వరదకు సంబంధించి గతంలో సంభవించిన వరదలు, నీటి ప్రవాహాన్ని నిరోధించేందుకు గండ్లు ఏ ప్రాంతంలో చేసింది తదితర వివరాలను ఆయన ఆరా తీశారు.వీరి వెంట ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, డిఎస్పీ శ్రవణకుమార్,ఇరిగేషన్ ఎస్ఈ సి హెచ్ దేవప్రకాష్,,నగరపాలక సంస్థ కమిషనరు భానుప్రతాప్, ఏలూరు తహశీల్దారు గాయత్రి తదితరులున్నారు.

# రైతుల ప్రయోజనాలు కాపాడుతాం

## పామాయిల్ ధరల విషయంలో నష్టపోకుండా చూస్తాం
## ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు కేంద్ర మంత్రి లేఖ

ఏలూరు,సెప్టెంబర్2: క్రూడ్ పామ్ ఆయిల్ ధరల విషయంలో ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుంటామని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారు. క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతులపై కస్టమ్ డ్యూటీ తగ్గించకుండా కొనసాగించాలని, ఆయిల్ పామ్ సాగు మరియు రైతులకు సరైన ధరలు లభించేలా చూడాలని కోరుతూ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ ఏలూరు ఎంపీకి కేంద్ర మంత్రి లేఖ రాశారు. ఈసందర్భంగా లేఖలో ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వంపై కేంద్ర మంత్రి ప్రశంసలు కురిపించారు. దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో 2.58 లక్షల హెక్టార్లలో పామ్ ఆయిల్ సాగు జరుగుతోందనీ, ఇది దేశీయంగా వంట నూనెల ఉత్పత్తిని పెంచి, స్వావలంబన సాధించాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి దోహదం చేస్తుందని కేంద్ర మంత్రి అభినందించారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రాధాన్యత ఇస్తోందని, ఈ ప్రోగ్రాం కింద విత్తనాలు, నాణ్యమైన మొక్కలు, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ప్రాసెసింగ్ యూనిట్లు మొదలైన వాటిని అందించి ప్రోత్సహిస్తోందన్నారు. ఈ మిషన్ కింద ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో 73,794 హెక్టార్లు మాత్రమే కవరయ్యాయని, కానీ కేంద్ర ప్రభుత్వ లక్ష్యం 1.12 లక్షల హెక్టార్లని, కాబట్టి ఇంకా విస్తృతంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.

# పాత్రికేయ గణపతి సేవలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

సెప్టెంబర్ 2కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, పాత్రికేయ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్టించబడిన శేషనాగా గణపతిని మంగళవారం సాయంత్రం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ, "మట్టి వినాయకుడిని ప్రతిష్టించడం పర్యావరణ పరిరక్షణలో ఒక మంచి సంకేతం. పాత్రికేయ మిత్రులు ఐకమత్యంతో ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ప్రశంసనీయమైన విషయం. ఆధ్యాత్మికతతో పాటు సామాజిక స్పృహను కలిపిన ఈ కార్యక్రమం అందరికీ ఆదర్శంగా నిలుస్తుంది" అని తెలిపారు.అలాగే, సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ముఖ్యమని, మట్టి వినాయకుల ద్వారా పర్యావరణానికి మేలు చేకూరుస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాత్రికేయ గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు మంజునాథ్ యాదవ్ విద్యాసాగర్ రామకృష్ణ ప్రసాద్ యాదవ్ పరమేష్ విజయ్ మక్బూల్ సాయికుమార్ నాయుడు హరి తదితరులు పాల్గొన్నారు



# రోడ్డెక్కిన గ్రీన్‌ఫీల్డ్ భూ నిర్వాసితులు

## పొలాలకు వెళ్లేందుకు సర్వీస్ రోడ్లు నిర్మించాలి
## రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

చింతలపూడి,సెప్టెంబర్2: గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని, గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ-, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రేచర్ల వద్ద రైతులు రోడ్డెక్కారు. భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించకపోవడం దారుణమని విమర్శించారు. రైతులు తమ పొలాలకు వెళ్లే మార్గాలు లేక, తమ పంటలు తెచ్చుకునే అవకాశం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక చోట్ల అండర్ పాస్ లు తగినంత ఎత్తు, వెడల్పు తో నిర్మాణం చేయకపోవడంతో గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని చెప్పారు. గ్రీన్ ఫీల్డ్ హైవే వలన ప్రతి గ్రామం పరిధిలో సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే అథారిటీ- అధికారులు, రెవిన్యూ అధికారులు, భూ సేకరణ అధికారులు క్షేత్ర స్థాయిలో గ్రామాల వారీగా రైతులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యల పట్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు కంచర్ల శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పి.పాండు రంగారావు, సిఐటియు జిల్లా నాయకులు ఆర్.వీ.ఎస్ నారాయణ తదితరులు మాట్లాడుతూ రేచర్ల ఎగ్జిట్ వద్ద రైతులు తమ పొలాలకు వెళ్లే మార్గం లేదన్నారు. సర్వీస్ రోడ్ ఏర్పాటు- చేస్తామని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని అధికారులు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. భూసేకరణలో రైతులకు అన్యాయం జరిగిందన్నారు. రేచర్ల నుండి లింగగూడెం వరకు ఉన్న అన్ని గ్రామాల పరిధిలో గ్రీన్ ఫీల్డ్ హైవే వలన అనేక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కారం చేయాలని కోరారు. ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు కొనకళ్ళ రాఘవరావు, ఉప్పల శ్రీనివాసరావు, ఆది జగన్, ఆది ధర్మారావు, కెక్కిరాల ఉపేంద్ర, బులుసు సతీష్,హరికృష్ణ, చీకటి సర్వేశ్వరరావు,పర్వతనేని మురళీ మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం చేసిన వినతి పత్రం మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు హైవే అథారిటీ- అధికారులు, రెవిన్యూ అధికారులు, కేఎంవీఎల్ రోడ్డు నిర్మాణ సంస్థ మేనేజర్ తదితరులు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం వలన రైతులకు,ప్రజలకు వస్తున్న సమస్యలను పరిశీలించారు. రైతులు సమస్యలు ఏకరువు పెట్టారు. మా సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారంటూ నిలదీశారు. ఈలోపుగా చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఇప్పటికైనా మా సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరారు. వినతి పత్రాలు అందజేశారు.

# సంక్షేమాలకు మార్గదర్శకుడు డాక్టర్ వైయస్సార్...!

## అభివృద్ధి,సంక్షేమ పథకాలకు దిక్సూచిగా నిలిచిన మహానేతకు ఘన నివాళి
## వైసీపీ నందికొట్కూరు సమన్వయ కర్త డా.ధారా సుధీర్.వైసీపీ శ్రేణులు

నందికొట్కూరు సెప్టెంబర్ 02:- సంక్షేమలకు మార్గదర్శకుడు తెలుగు ప్రజల గుండె చప్పుడు,అభివృద్ధికి నడకలు నేర్పిన నేత,రాష్ట్ర చరిత్రను మార్చిన మహానాయకుడు డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త డా.ధారా సుధీర్ అన్నారు.వైయస్సార్ 16వ వర్ధంతి సందర్భంగా మంగళవారం పాత బస్టాండ్, కోట వీధి లోని వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు, గవర్నమెంట్ హాస్పిటల్ లో బాలింతలకు బ్రెడ్లు,పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మహానేత భౌతికంగా మన మధ్య లేకపోయినా,ఆయన చూపిన మార్గం,అమలు చేసిన సంక్షేమ పథకాలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 108, 104,ఇళ్ల పంపిణీ,ఉచిత విద్యుత్,రైతు రుణ మాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు లక్షలాది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని ఆయన గుర్తుచేశారు.నీటి ప్రాజెక్టుల పరంగా వైఎస్ఆర్ చేసిన కృషి అమోఘమని, మన ప్రాంతానికి సంబంధించిన హంద్రీ నీవా,ముచ్చుమర్రి ప్రాజెక్టులు ఆయన చొరవతోనే నిర్మితమయ్యాయని తెలిపారు.రైతును రాజుగా చేసిన నాయకుడు వైఎస్ఆర్. పేదలకి దేవుడులాంటి వారని, అపర భగీరథుడిగా ప్రజల మనసుల్లో నిలిచిపోయారన్నారు.వైద్యం, విద్య, వ్యవసాయం,పేదల అభివృద్ధికి ఆయన చేసిన కృషి దేశానికే ఆదర్శంగా నిలిచిందని,వైఎస్ఆర్ పాలన నిజమైన స్వర్ణయుగం గుడిసె లేకుండా చేసిన చెందుతుందని చెప్పారు.వైఎస్ఆర్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన వేసిన అభివృద్ధి అడుగులు నేటికీ స్ఫూర్తిగా నిలుస్తున్నా యన్నారు.ఉచిత విద్యుత్,మహిళలకు పావలా వడ్డీ రుణాలు జలయజ్ఞం,పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం తో పేదల ఆకలి తీర్చారన్నారు.అదేవిధంగా ఇళ్ళులేని వారికి ఇందిరమ్మ ఇళ్ళుల్చి అన్నారు.ఆరోగ్యశ్రీ తో కొన్ని వేల ప్రాణాలు ఊపిరి పోసిన మహా నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శివరామకృష్ణారెడ్డి,మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ రమేష్ నాయుడు,పట్టణా అధ్యక్షుడు మన్సూర్,7వ వార్డ్ కౌన్సిలర్ నాయబ్,3వ వార్డ్ కౌన్సిలర్ అల్లూరి కృష్ణ, జూపాడు బంగ్లా జడ్పిటిసి పోచ జగదీశ్వర్ రెడ్డి, లింగాపురం సర్పంచ్ నాగార్జున రెడ్డి,లోకేశ్వర్ రెడ్డి,అబూబాక్కర్,మార్కెట్ రాజు,మాధురి గౌడ్,సురేష్ యాదవ్,లడ్డు,కేశవ, రాహంతుల్లా,రియాజ్ పట్టణ వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వరిలో దోమపోటు నివారణకు కాలిబాటలు



నందికొట్కూరు సెప్టెంబర్ 02:-వరిలో కాలిబాటలు తీయడం వలన దోమపోటును నివారించవచ్చని యూనిట్ ఇన్చార్జ్ కలిముల్లా షాఖాద్రి పేర్కొన్నారు.నందికొట్కూరు మండలంలో బొల్లవరం యూనిట్ దామగట్ల గ్రామంలో పద్మావతి మహిళా గ్రామ సమాఖ్య లో వాణి అనే మహిళా రైతు పొలంలో వరిలో దోమపోటు నివారణకు కాలిబాటలు వేయించారు.పొలం పిలుస్తోంది.కార్యక్రమంలో భాగంగా బీజామృతంతో నారు శుద్ధి చేసే విధానం గురించి వివరించారు.భీజామృతంతో విత్తన,నారు శుద్ధి చేయడం వల్ల నెల రోజుల వరకు వరికి చీడపీడలు ఆశించవని, ఎటువంటి క్రిమికీట కాలు పంట దరి చేరవన్నారు.ఈ పద్ధతిలో గాలి,వెలుతురు బాగ తగలడం వల్ల వరి నారు బాగా పిలకకట్టి ఎక్కువ దిగుబడిని ఇస్తుందన్నారు.వాటివలన వచ్చే ఉపయోగా లను రైతులకు వివరించారు. అలాగే వరి నాట్లు వేసే ముందు నారు కొన లను తుంచి నాటడం వలన కాండం తొలచు పురుగును నివారించవచ్చ న్నారు. వరిలో కాలిబాటలు వేయడం ద్వారా దోమపోటును నివారిం చడమేకాకుండా పొలంలో పంటను హానిచేసే చీడపురుగుల నివారణకు కషాయాలు,మరియు ప్రకృతి వ్యవసాయ ఎరువులు ఘన జీవామృతం,ద్రవ జీవామృతం చల్లేందుకు ఈ బాటలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు.ఈ కార్యక్రమంలో యన్ ఫ్ ఏ నరేంద్ర,ఎమ్ టి అయ్యస్వామి,బాలస్వామి,వి ఏ ఏ శాంతిరాజు,ఐ సి ఆర్ పి లు ఆదిలక్ష్మి,కుసుమలత మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

# గణనాథుడి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

## జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటేల్‌సీమ



. సెప్టెంబర్ 2 : గణనాథుడి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటేల్ అన్నారు . మంగళవారం కర్నూలు సమాచార శాఖ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ గణపతిని జిల్లా ఎస్పీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎష్పి మాట్లాడుతూ మాట్లాడుతూ గణనాథుని ఆశీర్వాదంతో ప్రజలందరూ ఆరోగ్యంగా,ఆనందంగా, సుఖశాంతులతో ఉండాలని కోరారు.అదే విధంగా జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగాలని ఎష్పి ఆకాంక్షించారు.అనంతరం పాత్రికేయ ఉత్సవ గణపతి సమితి సభ్యులు జిల్లా ఎస్పీని సత్కరించారు . ఈ సన్మాన కార్యక్రమంలో పాత్రికేయ ఉత్సవ సమితి నాయకులు.. మలపల మంజునాథ్ యాదవ్, రామకృష్ణ,.వెంకట సుబ్బయ్య. సాయికుమార్ నాయుడు కాపు హరినాథ్ రెడ్డి..,శ్రీనివాసులు, శ్రీనాథ్ రెడ్డి,అవినాష్ శెట్టి, హరి కృష్ణ, మల్లికార్జున, గంగాధర్,ఇస్మాయిల్, ఆసిఫ్,రాఘవేంద్ర, మధు,పరమేష్,తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట

## కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు

హైదరాబాద్,సెప్టెంబర్2: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. 2021లో నమోదైన కేసులో వ్యక్తిగత హాజరు నుంచి తెలంగాణ హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్ రావును కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ అక్టోబర్ 7వ తేదీకి వాయిదా వేసింది. సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టేయాలని సీఎం రేవంత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఏఐసీసీ పిలుపు మేరకు 2021లో పీసీసీ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదు అయింది. రేవంత్ రెడ్డిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉంది. ఈ కేసును కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్ట్.. రేవంత్ రెడ్డికి హాజరు మినహాయింపు ఇచ్చింది. తదుపరి విచారణ వచ్చే నెల 7వ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ-ఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com